

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (మంగళవారం) : 6.23
సహరి (బుధవారం) : 4.38

ఉష్ణోగ్రతలు

ప్రాంతం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	38.2	25.8
కావలి	35.0	27.0
కందుకూరు	36.0	28.0
ఆత్మకూరు	39.0	27.0
ఉదయగిరి	41.0	25.0



27న పాలీసెట్

జిల్లాలో పటిష్ట ఏర్పాట్లు

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 8 : పాటెక్నిక్‌లో ప్రవేశం కోసం జిల్లాలో ఈనెల 27వ తేదీన పాలీసెట్ నిర్వహించనున్నారు. ఈ ప్రవేశ పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.లవన్న అధికారులను ఆదేశించారు. ఈ మేరకు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం ఆయన సంబంధిత అధికారులతో సమీక్షించారు. జిల్లాలో పాలీసెట్‌కు హాజరయ్యే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు పోలీస్, వైద్య సిబ్బందితో లైజన్ ఆఫీసర్స్ సమన్వయం చేసుకోవా లన్నారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. నెల్లూరు రెవెన్యూ డివిజన్‌లో నారాయణ ఇంజనీరింగ్ కళాశాల, వీఆర్ పీజీ కళాశాల, అల్‌హుదా పాలిటెక్నిక్ కళాశాల, డాక్టర్ ఎస్ఆర్‌కే పాఠశాల, జగన్స్ డిగ్రీ కళాశాలల్లో, ఆత్మకూరులో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో, కావలిలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, పీబీఆర్ విశ్వోదయ కళాశాలల్లో 27వ తేదీ ఉదయం 11 నుంచి 1 గంట వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాలను నోఫోన్ జోన్‌గా ప్రకటించామని, పరీక్ష సమయంలో ఎవరూ సెల్‌ఫోన్‌లు వినియోగించవద్దని, ఫోన్‌లు వినియోగం తమ దృష్టికి వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులు హాల్‌టికెట్‌తో పాటు ఫొటో ఆధారిత ధ్రువపత్రంతో హాజరు కావాలని తెలిపారు. పూర్తి వివరాలకు ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా కోఆర్డినేటర్ వి.విజయ్‌కుమార్, ఫోన్ 9912342048ను సంప్రదించాలని తెలిపారు.

అధికారులతో సమీక్షిస్తున్న డీఆర్‌వో లవన్న

కోడ్ పక్కాగా అమలు

నెల్లూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల కోడ్‌ను జిల్లాలో పకడ్బందీగా అమలు చేస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం హరినారాయణన్ తెలిపారు. ప్రశాంత ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుంటోందని ఆయన వెల్లడించారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణలోని డీఆర్డీఏ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌ను ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, జేసీ సేతు మాధవన్‌లతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా హరినారాయణన్ మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్‌కు పది రోజుల ముందుగానే ఎన్నికల ఏర్పాట్లు మొదలుపెట్టినట్లు చెప్పారు. కోడ్ ఉల్లంఘనపై వస్తున్న ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. సీ విజిల్ ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఇప్పటి వరకు 257 ఫిర్యాదులు రాగా వాటిని వచ్చిన వంద నిమిషాల్లోనే పరిష్కరించామని చెప్పారు. నగదు, మద్యం, ఇతర వస్తువుల తరలింపుపై ప్రత్యేక దృష్టి పెట్టామని, జిల్లావ్యాప్తంగా 18 చెక్ పోస్టులను ఏర్పాటు చేశామని కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలో ఇప్పటివరకు రూ.7.50 లక్షల విలువైన 1200 లీటర్ల మద్యం, రూ.92 లక్షల నగదు, రూ.88 లక్షల విలువైన బంగారం, వెండి, రూ.7 లక్షల విలువైన ఇతర వస్తువులతో కలిపి మొత్తం రూ.1.98 కోట్ల విలువైన సామగ్రిని సీజ్ చేసినట్లు వివరించారు. ఈ నెల 10వ తేదీ నుంచి ప్రతి నియోజకవర్గంలో మూడు స్టాటికల్ సర్వేలెన్స్ టీమ్స్ పని చేస్తాయని ప్రకటించారు. ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాల్లో రాజకీయ ప్రకటనలకు తప్పనిసరిగా ఎంసీఎంసీ అనుమతులు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించినందుకు ఇప్పటివరకు 27 కేసులు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు. ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రశాంతంగా, స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవడమే లక్ష్యంగా పని చేస్తున్నామని చెప్పారు. గ్రామాల్లో సీఐలు, ఎస్సైలు పర్యటిస్తూ గ్రామపెద్దలతో మాట్లాడుతూ వివాదాలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో డీఐపీఆర్‌వో కే సదారావు, డీపీఆర్‌వో టీ మోహన్‌రాజు, ఇంజనీర్ ఏ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



మీడియా సెంటర్ ప్రారంభోత్సవంలో కలెక్టర్, ఎస్పీ

చికెన్ ధర పైపైకి..

ఆకాశమే హద్దుగా చికెన్ ధర ఎగబాకుతోంది. ఎండలు మండుతున్నవేళ ఆ ప్రభావం చికెన్ ఉత్పత్తులపై పడింది. దీంతో ధరలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. గతవారం కిలో రూ.220 పలికిన ధర రూ.80 చేరి కిలో రూ.300కు చేరింది. నెల్లూరులో బ్రాయిలర్ రూ.280 ఉండగా, స్కిన్‌లెస్ 310 రూపాయలకు విక్రయిస్తున్నారు. రానున్న రోజుల్లో ఎండలు మరింత పెరిగే అవకాశం ఉన్నందున కోళ్లు చనిపోతాయని, డిమాండ్‌కు తగ్గ ఉత్పత్తి లేకపోవడంతో ధరలు కూడా పెరుగుతాయని వ్యాపారులు చెబుతున్నారు.

- ఉదయగిరి



విద్యుత్ కోటా పెంపు

నెల్లూరు (జడ్పీ), ఏప్రిల్ 8 : వేసవిలో పెరిగిన విద్యుత్ వినియోగానికి తగ్గట్లు కోటా పెంచినట్లు ఎస్ఈ విజయన్ ఒక ప్రకటనలో తెలిపారు. వేసవి కావడంతో ప్ర జలంతా ఏసీ, కూలర్లు, ఫ్యాన్లు ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను ఎక్కువగా వినియో గించడం వల్ల విద్యుత్ వాడకం ఎక్కువైనట్లు తెలిపారు. దీంతో డిమండ్‌కు తగ్గట్లు కోటా పెంచాలని సీఎండీ సంతోషరావును కోరామని, ఆ మేరకు రోజుకి 12 మిలియ న్ యూనిట్లు ఉన్న కోటాను 15మిలియన్ యూనిట్లకి పెంచారని తెలిపారు. మరో వైపు లోఓల్టేజ్ ఉన్న ప్రాంతాల్లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.



క్రోధి ఉగాది
కొత్త ఉషస్సునివ్వాలి!

- నేడు తెలుగు సంవత్సరాది
- షడ్రుచుల పచ్చడి ప్రత్యేకం
- గ్రహ ఫలితాలు ఆందోళనకరమంటున్న పండితులు
- ఎన్నికల ఏడాది హడావిడి
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు.. పంచాంగ పఠనం

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 8 : కొత్త ఏడాది ప్రారంభాన్నే యుగాది.. ఉగాదిగా పిలుచుకుంటాం. ఇది తెలుగువారి నూతన సంవత్సరాది. నేటి నుంచి శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది ప్రారంభమవుతోంది. షడ్రుచుల పచ్చడి ఈ పండుగకు ప్రత్యేకం. సంతోషము, దుఃఖ ము, కష్టము, నష్టము.. ఇలా అన్నింటి సమ్మేళనమే జీవితమని తెలియజేప్పేందుకు, దానిని ఆచరించేందుకే ఈ ఆరు రుచుల పచ్చడిని ప్రసాదంగా స్వీకరిస్తారు. ఇది ఆరోగ్యపరంగానూ ఎంతో ప్రాముఖ్యత కలిగినది. వేప పువ్వు, మామిడి ముక్కలు, కొత్త బెల్లం, కొత్త చింతపండు, ఉప్పు, మిరియాలతో ఉగాది పచ్చడిని తయారు చేస్తారు. ఇది వాతావరణ మార్పుల వల్ల కలిగే అనారోగ్యాన్ని హరించి ఆరోగ్యాన్ని క్రమబద్ధీకరిస్తుంది. ఏడాది పొడవున మనలో కలిగే సంతోషం (తీపి), దుఃఖం (చేదు), కోపం (కారం), భయం (ఉప్పు), విసుగు (చింతపండు), ఆశ్చర్యం/సంభ్రమం (మామిడి) వంటి భావాలకు ఈ ఆరు పదార్థాలు ప్రతీకగా చెబుతారు. ఇక, ఉగాది పండుగనాడు మరో ప్రత్యేకం పంచాంగ శ్రవణం. నూతన ఏడాది వర్షాలు, పాడిపంటలు, రాజ్యపాలన వంటి వాటిని గ్రహస్థితుల ఆధారంగా అంచనా వేసి పండితులు వివరిస్తారు. అయితే రాబోవు శ్రీక్రోధి నామ సంవత్సరంలో గ్రహస్థితి, గోచార ఫలితాలు ఆందోళనకరంగా ఉంటాయని సిద్ధాంతులు విశ్లేషిస్తున్నారు. క్రోధి అంటేనే క్రోధం(కోపం) అని అర్థమని, ఈ సంవత్సరంలో ప్రజలు కోపం, ఆవేశం కలిగి ఉంటారని తెలియజేస్తున్నారు. ఈ ఏడాది రాజు కుజుడు కావడంతో మనుషుల మధ్య, దేశాల మధ్య శత్రుత్వం పెరుగుతుందని చెబుతున్నారు. అలాగే... మంత్రి, సైన్యాధిపతి, ధాన్యాధిపతి కావడంతో వర్షాలు తక్కువగా కురిసి, పంటల సాగు తగ్గుతుందని, దేశ సరిహద్దుల్లో యుద్ధ వాతావరణం నెలకొంటుందని, ప్రజా జీవనం భయభ్రాంతులతో నిండి ఉంటుందని, వ్యాధులు ప్రబలుతాయని అంచనా వేస్తున్నారు. శశ్యాధిపతి కుజుడు కావడంతో మిర్చి, ఎర్ర శనగలు, కందులు వంటి పంటలు బాగా పండుతాయంటున్నారు. అయితే, గ్రహ ఫలితాలు ఎలా ఉన్నా.. నూతన సంవత్సరం ప్రజలందరి జీవనస్థితి మెరుగుపడాలని, అందరికీ తగిన అవకాశాలు రావాలని, అందరి జీవితాల్లో కొత్త కాంతులు విరియాలని ఆశిద్దాం.

ఆలయాల్లో ఉత్సవాలు

ఉగాది పండుగ సందర్భంగా జిల్లాలోని అన్ని ఆలయాల్లో ప్రత్యేక పూజలు, విశేష కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అలాగే పంచాంగ పూజ, పంచాంగ శ్రవణం జరపనున్నారు.

కొత్త ఏడాది తొలి పండుగ సందర్భంగా కొత్త వ్యాపారాలు ప్రారంభించడం, కొత్త వస్తువులు కొనుగోలు చేయడం కొందరు ఆనవాయితీగా అనుసరిస్తుంటారు. నెల్లూరు గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి అమ్మవారికి మంగళవారం రాత్రి నగరోత్సవం జరుగుతుందని ఆలయ ఈవో మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు.


- రాజ్యపూజ్యమెవరికి.. అవమానం ఎవరికి!?
- ఎన్నికల సమరంలో అభ్యర్థుల జాతకం ఎలా ఉం టుందో!?

రాశి, జన్మనక్షత్రాల ఫలితాలు అటుంచితే..
రాజకీయక్షేత్రంలో జయాపజయాలు ఎవరివో!
ఆంధ్రజ్యోతి అందిస్తున్న సరదా ఎన్నికల పంచాంగం

ఉగాది అంటే తెలుగు సంవత్సరాది మాత్రమే కాదు... జనబాహుళ్యంలో జాతకాలు తెలిపే రోజు కూడానూ.. ఈ సందర్భంగా ఆ ఏడాది పంటలు మొదలు ప్రకృతి వైపరీత్యాల వరకు, పాలకుల స్థితిగతులు మొదలు... వ్యక్తుల రాశి ఫలాల వరకు అన్ని ఉగాది నుంచే ఆరంభం అవుతాయన్నది తెలుగువారి విశ్వాసం. ఆ క్రమంలోనే ఉగాది రోజు నుంచి రాష్ట్ర స్థితిగతులు ఎలా ఉండబోతాయన్న విషయాన్ని పంచాగ శ్రవణం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేసుకుంటుంది. సాధారణ పరిస్థితుల్లో వచ్చే ఉగాదికే ఇంత ప్రత్యేకత ఉంటే.. ఇక సార్వత్రిక ఎన్నికల ముందు వచ్చే ఉగాదికి ఇంకెంత ప్రాధాన్యత ఉంటుందో ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. ఎన్నికల బరిలో దిగిన నాయకుల రాశి ఫలాలు ఎలా ఉండబోతాయన్న విషయంపైనే ప్రజలు ఎక్కువ ఆసక్తి చూపుతారు. పాఠకుల ఆసక్తిని దృష్టిలో ఉంచుకొని ఆంధ్రజ్యోతి అందిస్తున్న సరదా ఎన్నికల పంచాంగం ఇది. రాశులు, జన్మనక్షత్రాల ఫలితాలను పక్కన పెట్టి నియోజకవర్గాల వారీగా నెలకొన్న తాజా పరిస్థితిని అంచనా వేస్తూ అందిస్తున్న కథనం.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

ఎవరి గ్రహస్థితి ఎలా ఉందో..?





ఎన్డీఏ కూటమి అభ్యర్థిగా బరిలో నిలిచిన వేమిరెడ్డి ప్రభాకరరెడ్డికి రెండు నెలల క్రితమే గురు మహర్దశ మొదలయ్యింది. ఏ కార్యంలో విజయం సాధించాలన్నా గురు బలం చాలా అవసరం. ఇది ఆయనకు పుష్కలంగా కనిపిస్తోంది. రాజయోగ కారకుడైన రవి ఈయనకు అనుకూలంగా ఉన్నారు. ఆ కారణంగానే ఈయన రెండు నెలల క్రితం తన స్థానాన్ని మార్చుకున్నారు. రాజయోగ కారుకులైన రవి, గురువు, శుక్రుడు ఈ ముగ్గురు ఈయనకు అనుకూలంగా ఉన్నట్లు కనిపిస్తోంది. ఆ క్రమంలోనే ఈయన పట్ల ప్రజలు సానుకూలత వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈయన జాతకం ప్రకారం ఎన్నికల్లో నక్కజిత్తులను ఎదుర్కోవలసి ఉంటుంది. జిత్తులమారి ఎత్తుగడల్లో ఈయనకు కొంత చికాకులు కలిగే సూచనలు కనిపిస్తున్నాయి. ఇక అధికార వైసీపీ నుంచి పోటీలో ఉన్న విజయసాయి రెడ్డికి ప్రస్తుతానికి గ్రహస్థితి బాగానే ఉన్నా మే తరువాత అంత అనుకూలంగా కనిపించడం లేదు. మే ఆరంభంలో గురువు స్థానం మారనున్న కారణంగా బలహీనపడనున్నట్లు తెలుస్తోంది. ఆ ప్రభావం ఇప్పటి నుంచే మెల్లమెల్లగా కనిపిస్తోంది. సొంత సైనికులు ఒక్కొక్కరుగా శత్రుకూటమిలో చేరిపోతున్నారు. అర్థ బలం ఎంత ఉన్నా కార్యకర్తల బలం తగ్గిపోయే సూచనలు కనిపిస్తున్నాయి. నీచగ్రహాలైన కుజుడు, శనిలు రాజ్యాధికారానికి అడ్డుపడే సూచనలు కనిపిస్తున్నాయి. వీటికితోడు ఛాయాగ్రహాలైన రాహు, కేతువులు వీరితో జత చేరడం మరింత ఆందోళన కలిగించే అంశం.

నెల్లూరు సిటీ : టీడీపీ అభ్యర్థి పొంగూరు నారాయణ. ఈ వృశ్చిక రాశి వారికి పరిస్థితి చాలా అనుకూలంగా ఉంది. రాజయోగం లక్షణాలు బలంగా ఉన్నాయి. ఈ రాశివారితో శత్రుత్వ పెట్టుకున్నవారికి స్థానచలనం తప్పదని జాతక చక్రం చెబుతోంది. ఎన్నికల సమరంలో తలపడాల్సిన శత్రురాజు తన దిశ మార్చుకొని యుద్ధం నుంచి తప్పుకున్నారు. ఈ ఘటనతోనే ఈయన విజయం దాదాపుగా ఖరారయ్యిందని రాజ్యపౌరులు భావిస్తున్నారు. ఈయనకు రాజయోగ కారకులైన రవి, గురువు, శుక్రునితోపాటు అన్ని గ్రహాలు అనుకూల దిశగా కదులుతున్నాయి. ప్రత్యర్థి అభ్యర్థి ఖలీల్ అహ్మద్‌కు అన్ని గ్రహాలు బలహీనంగా ఉన్నాయి. బుధుడు ప్రభావంతో ఊహించని విధంగా టికెట్ లభించినా రాజయోగ కారకులైన మూడు గ్రహాలు ఈయన వైపు వక్రంగా చూస్తున్నాయి. గతంలో నాయకుడు చేసిన తప్పిదాలు రాహు, కేతు రూపంలో ఖలీల్‌ను వెంటాడనున్నాయి.

నెల్లూరు రూరల్: తెలుగుదేశం అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి ఏడాది క్రితమే శుక్ర మహర్దశ మొదలయ్యింది. ప్రస్తుతం గురువు కూడా అనుకూలంగా మారడంతో బలమైన వ్యక్తులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, పొంగూరు నారాయణలు స్నేహితులుగా చెరోవైపు నిలబడి సమర శంఖం పూరిస్తున్నారు. స్నేహబంధం కూడా తోడుగా నిలవడంతో ఈయనకు అన్ని అనుకూలతలు కనిపిస్తున్నాయి. ఈయన ప్రధాన ప్రత్యర్థి ఆదాల ప్రభాకరరెడ్డి. ఈ రాశి వారు చాలా లోపలి మనుషులు. చాపకింద నీరులా పనులు చక్కబెట్టుకోవడం వీరి నైజం. అర్థబలం, జిత్తులమారి ఎత్తుగడలతో బలమైన పోటీదారుగా బరిలో నిలబడ్డారు. అయితే మే ఆరంభానికి ఈయనకు కూడా గురుబలం తగ్గే సూచనలు కనిపిస్తున్నాయి. రాహుకేతుల ప్రభావంతో ఈయన ఎత్తుగడలు పని చేయకపోవచ్చు.

కోవూరు : వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి. ఈమెకు రాజయోగకారుడైన రవి ఈమె జన్మనక్షత్రంలో ఉన్నారు. ఎన్నికల సమరంలో ఈమె బలం పుంజుకుంటారు. గురువు స్థానంలో భర్త వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి ఎన్నికల సారథ్యం వహిస్తున్నారు. యుద్ధం ఆరంభం కాకమునుపే ఈమె ఫలితాలపై ప్రజలు ఒక అభిప్రాయానికి వచ్చేశారు. ఈమె ప్రధాన పోటీదారు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి స్వతహాగా యుద్ధ వీరుడు. ఎన్నో యుద్ధాలు చేసిన అనుభవం ఉన్నవారు. వ్యూహ రచనలో దిట్ట. అయితే ఈయన గ్రహస్థితి అంత బాగాలేదు. ఆ కారణంగానే ఎన్నికల యుద్ధంలో తనతో తలపడే ప్రత్యర్థి ఊహించని రీతిలో మారిపోయారు. మిత్రులు అనుకున్నవారే శత్రువులుగా మారిపోయారు.

కావలి : తెలుగుదేశం అభ్యర్థి దగుమాటి వెంకటకృష్ణారెడ్డి. ఈయనకు గురుబలం బాగా ఉన్న కారణంగా టిక్కెట్టు సాధించుకున్నారు. అయితే కుజుడు, శని గ్రహాలు ఈయనకు అనుకూలంగా లేవు. ఆ ప్రభావంతో సొంత సైన్యంలో ఐక్యత లోపించింది. ఉగాది తరువాత గ్రహస్థితి మెరుగుపడే సూచనలు కనిపిస్తున్నాయి. ఈయన ప్రత్యర్థి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి శుక్రుడు బలంగా ఉన్నా రవి, గురు ప్రభావాలు తక్కువగా కనిపిస్తున్నాయి. పైగా ఛాయాగ్రహాలైన రాహుకేతువులు వక్రంగా చూస్తున్నాయి. వీటి ప్రభావంతో గతంలో చేసిన పొరపాట్లు ఓటు సమయంలో ప్రత్యర్థులకు అనుకూలంగా మారే సూచనలు కనిపిస్తున్నాయి.

ఉదయగిరి : ప్రధాన పార్టీల అభ్యర్థులు ఇద్దరూ యుద్ధ రంగానికి కొత్త వారే. ఎవరి ఎత్తులు వారు వేస్తున్నారు. సర్వశక్తులు మోహరిస్తున్నారు. అయితే తెలుగుదేశం అభ్యర్థి కాకర్ల సురేష్‌కు రాజయోగకారకులైన రవి, గురువు, శుక్రుడు అనుకూ లంగా ఉండగా ప్రత్యర్థి మేకపాటి రాజగోపాల్ రెడ్డికి శుక్రుడు బలంగా ఉన్నారు. ముందుతరం చేసిన తప్పులు శాపాలై రాహుకేతువుల రూపంలో వెంటాడే సూచనలు కనిపిస్తున్నాయి. ఏది ఏమైనా ఉదయగిరి రణభూమిలో హోరాహోరి వాతావరణం కనిపిస్తోంది.

ఆత్మకూరు : తెలుగుదేశం అభ్యర్థిగా ఆనం రామనారాయణరెడ్డి తలపడుతున్నారు. ఈ ఏడాది మార్చి వరకు ఈయనకు గ్రహస్థితి బాగా లేని కారణంగా రాజకీయంగా చాలా ఒడిదుడుకులు ఎదుర్కొన్నారు. ఏప్రిల్ నుంచి ఈయనకు గురువు అనుకూలించాడు. ఆత్మకూరులో గతంలో చేసిన అభివృద్ధి పనులు ఈయనకు బాగా అనుకూలిస్తున్నాయి. మే నాటికి ఈయనకు రవి, శుక్రుడు కూడా అనుకూలించనున్నాడు. ప్రత్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డికి గ్రహస్థితి పర్లేదు. అయితే ఏప్రిల్ నెలాఖరుకు ఈయనకు కుజుడు, శని గ్రహాలు వక్రించే సూచనలు కనిపిస్తున్నాయి. దీనివల్ల అశాంతి, ఆందోళన, తిరుగుబాట్ల ప్రభావాలు ఈయన్ను చికాకుపెట్టే సూచనలు కనిపిస్తున్నాయి.

సర్వేపల్లి : గతానికి భిన్నంగా తెలుగుదేశం అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఎన్నికల రణ క్షేత్రంలో విజృంభించనున్నారు. మారిన గ్రహాలు ప్రజల్లో ఆయన పట్ల ప్రత్యేక అభిమానం, సానుభూతి ప్రదర్శించే అవకాశాలను సూచిస్తున్నాయి. గతంలో చేసిన మేళ్లు తాలూకు ప్రభావం, ప్రత్యర్థి అనుసరించిన అణచివేత విధానం సోమిరెడ్డికి బాగా ఉపయోగపడనున్నాయి. ఈయన ప్రత్యర్థి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నివిధాలా బలవంతుడే అయినా గ్రహస్థితి మాత్రం అంత బలంగా కనిపించడం లేదు. కుజ, శని, రాహు, కేతు గ్రహాల వక్రదృష్టి కారణంగా ఈయనకు చికాకులు కలిగే సూచనలు కనిపిస్తున్నాయి. ఊహించని సమాచారాలు ఈయన్ను కలవరపాటుకు గురిచేసినా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు.

వైసీపీ ఓ వికృత పార్టీ.. త్వరలో ప్రజలే బుద్ధి చెబుతారు!

- ఓడిపోతామన్న భయంతోనే అసత్య ఆరోపణలు : వేమిరెడ్డి దంపతుల ఆగ్రహం

కొడవలూరు, ఏప్రిల్ 8 : వైసీపీ ఒక వికృత పార్టీ అని, ఆ పార్టీకి, ఆ పార్టీ ముఖ్యనాయకులకు త్వరలో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని ఎన్డీఏ కూటమి నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. సోమవారం నార్తురాజుపాళెంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో వారు పాల్గొని ప్రసంగించారు. అంకుముందు వేమిరెడ్డి దంపతులకు పార్టీ నాయకులు బైక్ ర్యాలీతో ఘన స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సభలో వేమిరెడ్డి ప్రబాకర్ రెడ్డి మాట్లాడుతూ తాము పార్టీ మారినప్పటి నుంచి వైసీపీ నాయకులు చీప్ పాలిటిక్స్ ఆడుతున్నారని మండిపడ్డారు. తాజాగా ఓ ఫేక్ ఆడియోను విడుదల చేసి వికృతానందం పొందుతున్నారని మండిపడ్డారు. వైసీపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి వయసుకు ఇలాంటి చీప్ పాలిటిక్స్ ప్లే చేయడం విడ్డూరంగా ఉందన్నారు. హుందా రాజకీయలు చేస్తే ప్రజలు హర్షిస్తారని, వారే తగిన రీతిలో బుద్ధి చెబుతారని అన్నారు. కోవూరు అభ్యర్థి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ వైసీపీ నాయకులు విజయసాయిరెడ్డి, ప్రసన్నకుమార్ రెడ్డి, రాజేంద్ర తదితరులు తమపై అసత్య ప్రచారం చేస్తూ ఓ తప్పుడు ఆడియోను రిలీజ్ చేశారని దాన్ని ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. ఢిల్లీ నుంచి ఎంపీ అభ్యర్థిగా ఇక్కడికి వచ్చిన విజయసాయి రెడ్డి జిల్లాకు ఏం చేశారో చెప్పి ఓట్లు అభ్యర్థించాలని డిమాండ్ చేశారు. వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిపై పోటీకి సరైన నాయకుడు లేక విశాఖ నుంచి ఇంపోర్టు చేసుకున్న విజయసాయి పిచ్చిపట్టినట్లుగా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. అనంతరం వైసీపీకి చెందిన కిరణ్ కుమార్, బండి అనిల్ కుంబ్లే తదితరులు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోటంరెడ్డి అమరేంద్రరెడ్డి, మందిపాటి ప్రవీణ్ కుమార్, ఇరువూరి శ్రీధర్‌రెడ్డి, గరికపాటి రాజేంద్రకుమార్, తువ్వర ప్రవీణ్, నాసిన ప్రసాద్, మందిపాటి రమణా రెడ్డి, దిలీప్ రెడ్డి, పాటూరి రమేష్, జనసేన నాయకుడు కిషోర్ పాల్గొన్నారు.



వేమిరెడ్డి దంపతులను గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

ఆర్టీసీ బస్సు, ఆటో ఢీ : ఆటో డ్రైవర్‌కి తీవ్రగాయాలు


ప్రమాదంలో దెబ్బతిన్న ఆటోను పరిశీలిస్తున్న స్థానికులు

కావలి రూరల్, ఏప్రిల్ 8: ఆర్టీసీ బస్సు, ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఆటోడ్రైవర్ దూదేకుల మౌలాలి తీవ్రంగా గాయపడ్డాడు.ఈ సంఘటన సోమవారం పట్టణంలోని ముసునూరు ట్రంక్‌రోడ్డులోని హోండా షోరూం వద్ద చోటుచేసుకుంది. బాధితుడి కథనం మేరకు, ముసునూరు అరుధంతీయవాడకు చెందిన మౌలాలి తన ఆటో(ఏపీ 37 టీకే 4873)ను బాడుగలకు తిప్పుతూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో ముసునూరులోని తన ఇంటి వద్ద నుంచి ఆటోలో ఒక్కడే కావలికి వస్తుండగా, కావలి నుంచి నెల్లూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో మూడు పల్టీలు కొట్టగా, మౌలాలి తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన అతడ్ని 108 వాహనంలో కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కావలి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దూబగుంట హైస్కూల్‌లో విద్యుత్ తీగల చోరీ

● నెలలో ఇది రెండోసారి..

ఏఎస్ పేట, ఏప్రిల్ 8: మండలంలోని దూబగుంట హైస్కూల్‌లో తాగునీటికి విద్యుత్‌ను సరఫరా చేసే తీగలు చోరీ అయ్యాయి. సోమవారం ఉదయం పాఠశాలకు వచ్చిన సిబ్బంది నీటి కోసం బోరు మోటర్ ఆన్ చేయగా ఆన్ కాలేదు. మోటర్‌ను పరిశీలించాగా మోటర్ నుంచి పాఠశాల ఆఫీస్ రూమ్ వరకు ఉన్న విద్యుత్ తీగలు మాయం అయినట్లు గుర్తించారు. గతంలో ఈ పాఠశాలలోనే ఫ్యాన్లు, ఇతర సామాన్లు చోరీ చేశారు. దీనిపై ఉపాధ్యాయులు పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు. గతంలో గుంపర్లపాడు గ్రామంలోని హైస్కూల్‌లో కూడా ఎల్‌ఈడీ టీవీని చోరీ చేశారు. నెలరోజుల్లో పాఠశాలల్లో చోరీ జరగడం ఇది రెండోసారి. వరుస ఘటనలు స్థానికులకు చర్చనీయాశంగా మారాయి. ఇంటి దొంగలే ఈ పని చేశారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పెన్నా బ్యారేజీలో గుర్తుతెలియని మృతదేహం

పొదలకూరు, ఏప్రిల్ 8 : మండలంలోని విరువూరు పంచాయతీలో గల సంగం పెన్నా బ్యారేజీ 86వ పిల్లర్ వద్ద నీటిలో సుమారు 35 సంవత్సరాల వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని సోమవారం గుర్తించినట్లు పొదలకూరు సీఐ రాంబాబు తెలిపారు. పెన్నా బ్యారేజీ ఒడ్డున నీలం రంగు చొక్కా, బ్రౌన్ కలరు చెప్పులు లభించినట్లు వెల్లడించారు. మృతుడు గుడ్డలు తీసి ఒడ్డున వుంచి నీటిలో దిగి ఈత రాక మునిగి చనిపోయి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. మృతుడి గురించి ఎవరికైనా సమాచారం తెలిసి వుంటే 94407 00006 నెంబరుకు సమాచారం తెలపాలని కోరారు.

గొలుసుల దొంగ అరెస్టు


మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న రూరల్ డీఎస్పీ, పక్కన సీఐ హైమారావు

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 8: స్కూటీపై వెళ్తూ వృద్ధులు, మహిళల మెడల్లోని బంగారు చైన్లు అపహరించిన దొంగను బుచ్చి పోలీసులు ఎట్టకేలకు అరెస్టు చేశారు. ఈమేరకు సోమవారం రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి బుచ్చి పోలీస్‌స్టేషన్‌లో సీఐ హైమారావు, సిబ్బందితో ఏర్పాటు చేసిన సమాశంలో చోరీలకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. నెల్లూరు మన్సూర్ నగర్‌కు చెందిన మల్లెలదొర అనే వ్యక్తి వృద్ధులు, మహిళల మెడలలోని 14 చైన్లు దోపిడీ చేసినట్టు విచారణలో తేలిందన్నారు. దొంగ తమిళనాడులోని వెల్లిపురంకు చెందినవాడు కాగా, పదేళ్ల ఢిల్లీలో తరువాత నెల్లూరులో స్థిరపడ్డాడన్నారు. బేల్దారి పనులు చేసుకుంటూ కరోనా సమయంలో పనులు లేక చెడు అలవాట్లకు బానిసై దొంగతనాలను ఎంచుకుని చోరీల కోసం స్కూటీలను దొంగిలించి వాటిపైన తిరుగుతూ చైన్ స్నాచింగ్ చేస్తున్నట్టు విచారణలో తేలిందన్నారు. మల్లెలదొర చేసిన దొంగతనాలకు సంబంధించి బంగారు చైన్లు, 7స్కూటీలను స్వాధీనం చేసుకున్నట్టు వారు తెలిపారు. బుచ్చి మండలంలో 4, కోవూరు 3, మనుబోలు, ముత్తుకూరు, నెల్లూరు 1టౌన్, కావలి 1టౌన్, పొదలకూరు మండలాల్లో దొంగతనాలు జరిగాయని తెలిపారు. ఇప్పటి వరకు 13 కేసుల్లో నిందితుడి నుంచి మొత్తం రూ. 15లక్షలు సొత్తు రికవరీ చేసినట్టు వారు తెలిపారు. సీఐ హైమారావు అధ్వర్యంలో డీఎస్పీ ఐడీ పార్టీ సిబ్బంది బృందాల నుంచి గిరి, గంగాధర్ సంపత్, అనిల్, సతీష్, నవీన్‌లకు ఎస్పీ ప్రకటించిన రివార్డులను డీఎస్పీ అందజేశారు.

చెక్‌పోస్టుల వద్ద నిరంతర తనిఖీలు

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 8: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో డబ్బు, మద్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు జిల్లా ఎస్పీ కె ఆరీఫ్ హఫీజ్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులలో పోలీసులు నిరంతరం వాహన తనిఖీలు చేపడుతున్నారు. అందులో భాగంగా సోమవారం తగిన రశీదులు లేకుండా కండలేరు పోలీసు స్టేషన్ పరిధిలో అక్రమంగా తరలిస్తున్న రూ.72 వేల, చేజర్ల పరిధిలో రూ.3.40లక్షల, బుచ్చి పరిధిలో రూ.63,350లు కలిపి రూ.4,75,350 పోలీసు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కొడవలూరు పోలీసు స్టేషన్ పరిధిలో 30, అల్లూరు పోలీసు స్టేషన్ పరిధిలో 15, బాలాజీనగర పోలీసు స్టేషన్ పరిధిలో 10, మనుబోలు స్టేషన్ పరిధిలో 6 మద్యం సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా దాడులు చేసిన సెబ్ అధికారులు 204 మద్యం సీసాలను సీజ్ చేశారు.

ఇరువర్గాల ఘర్షణ : పలువురికి గాయాలు

బిట్రగుంట, ఏప్రిల్ 8: బోగోలు మండలం పాతపాలెంలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో పలువురికి గాయాలయ్యాయని ఎస్‌ఐ భోజ్యా తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఘర్షణ నేపథ్యంలో పోలీసు పికెట్ ఏర్పాటు చేశామని తెలిపారు. గ్రామ సర్పంచు గిరిబాబు అభివృద్ధి పనులు చేయడం లేదని, స్థానికులు కొందరు ఈ నెల 4న సమావేశం ఏర్పాటు చేశారు. అయితే సర్పంచు హైదరాబాద్‌లో ఉండటంతో సకాలంలో రాలేదు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగి ఘర్షణకు దారి తీసిందని ప్రళయకావేరి గోవిందయ్య ఈనెల 7న ఫిర్యాదు చేశారని ఎస్‌ఐ తెలిపారు. అదే రోజు సాయంత్రం జరిగిన ఘర్షణలో గోవిందయ్యతోపాటు పొన్నపూడి గోవిందస్వామి, బాబు, సుబ్బారావులకు గాయాలయ్యాయి. వారంతా నెల్లూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారని ఎస్‌ఐ తెలిపారు. సర్పంచు అభివృద్ధి పనులు చేయనందుకు కాదని, వ్యక్తిగతంగా ఘర్షణ జరిగిందని పలువురు గ్రామస్థులు తెలిపారు.

15 మద్యం సీసాల స్వాధీనం

అల్లూరు, ఏప్రిల్ 8 : అల్లూరు మండలం నార్త్‌మోపూరులో బెల్టుషాపుపై సోమవారం వేకువ జామున ఎస్‌ఐ శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో పాదర్తి నాగేశ్వరరావుకు చెందిన దుకాణంలో 15 మద్యం సీసాలను గుర్తించారు. మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, నాగేశ్వరరావును అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ బెల్టుషాపు నిర్వహిస్తున్నట్లు తమకు సమాచారం అందిందని, దీంతో దాడులు చేయగా మద్యం సీసాలు దొరికాయన్నారు.

వాకర్స్‌కు వైద్య శిబిరం

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 8 : నగరంలోని ఏసీ సుబ్బా రెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో సోమవారం ఏసీ స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాకర్స్‌కు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వాకర్స్‌కు వైద్యులు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి పలు సూచనలు, సలహాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి అనంత రామారావు, కార్యదర్శి గుర్రం సురేంద్రబాబు, కోశాధికారి అరిగెల సాయిరాం, మాజీ అధ్యక్షులు వేలూరు రంగారావు, కిలారి తిరుపతినాయుడు, బాసం శేషగిరిరావు, సభ్యులు రామానాయుడు, బాలసుధాకర్, డాక్టర్ శ్రీనివాసకుమార్, మురళి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అనాథలు, దివ్యాంగులకు ఉగాది పురస్కారాలు

నెల్లూరు(సాంస్కృతికం), ఏప్రిల్ 8: శ్రీక్రోధినామ సంవత్సరం ఉగాది వేడుకలను స్థానిక టౌనుహాలు రీడింగ్ రూమ్‌లో మంగళవారం ఉదయం 10గంటల నుంచి జిల్లా రచయితల సంఘం వినూత్నంగా నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు ఏ జయప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా కవి సమ్మేళనం సత్కారాలు ఔత్సాహికులకు మాత్రమే ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అనాథ బాల బాలికలు, దివ్యాంగులు, అంధ విద్యార్థులు, వైద్య, నర్సింగ్ విద్యార్థులు కవితలు చదివి, పురస్కారాలు అందుకుంటారని తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	161
లేయర్ లైవ్	95
స్కిన్ చికెన్	280
స్కిన్‌లెస్	310
లేయర్	162

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6759
వెండి కిలో ధర	రూ. 83,800
వెండి ఒక గ్రాము	రూ. 85.80

మద్యం సీసాల స్వాధీనం

మనుబోలు, ఏప్రిల్ 8: ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఒక వ్యక్తి రెండు మద్యం సీసాల కంటే ఎక్కువ తీసుకెళ్ళ కూడదు. ఈక్రమంలో ముద్దమూడి గ్రామానికి చెందిన తాటిపర్తి వెంకయ్య అనే వ్యక్తి ఆరు మద్యం సీసాలు తీసుకెళుతున్నాడని ముందస్తు సమాచారం రావడంతో ఎస్‌ఐ అజయ్‌కుమార్ తన సిబ్బందితో వెళ్ళి కొమ్మల పూడి క్రాస్‌రోడ్డు వద్ద వెంకయ్యను అదుపులోకి తీసుకుని ఆరు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పండగ పూటా పస్తులేనా?

● నేడు ఉగాది, 11న రంజాన్ ● 8వ తేదీ గడిచినా అందని వేతనాలు
● కార్పొరేషన్‌లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేదన ● 2 వేల మందికిపైగా నిరీక్షణ



నెల్లూరు(సిటీ), ఏప్రిల్ 8

ఏపీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల క్రితం బాధ్యతలు తీసుకున్నప్పట్నుంచి ప్రభుత్వ రంగ సంస్థల్లో పని చేస్తున్న ఉద్యోగులెవ్వరికి 1, 2 తేదీల్లో జీతాలిచ్చిన దాఖలాలు లేవు. చివరికి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా అదే పరంపర కొనసాగుతోంది. ప్రస్తుతం ప్రభుత్వంలో పాలకవర్గ పెత్తనం లేకపోయినప్పటికీ ఖజానాలో డబ్బులు కొరత లేక టెక్నికల్ సమస్య తెలియదు కానీ ఇప్పటికీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీతం అందలేదు. నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలో సుమారు 2 వేల మందికి పైగా ఉద్యోగులు వేతనం కోసం గడియ గడియకు ఎదురుచూస్తున్నారు. నేడు నూతన తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినం కాగా కాగ 11వ తేదీన ప్రవిత్ర రంజాన్ పండుగ ఉంది. ఈ పర్వదినాలను ఎలా గట్టెక్కించాలా అంటూ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● **అసలే అరకొర వేతనాలు**

నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలో పారిశుధ్య విభాగంలోనే 1700 మంది ఆప్కాస్ నేతృత్వంలోని ఔట్‌సోర్సింగ్ విభాగంలో పని చేస్తుండగా వివిధ సెక్షన్లలో మరో 400 మంది వరకు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులున్నారు. వీరికి రూ.15వేలు, రూ. 18 వేలు కేటగిరీల వారీగా జీతాలను ప్రభుత్వం చెల్లిస్తోంది. ప్రతి నెల 5వ తేదీ పైన వీరి ఖాతాల్లో జీతం జమ అయ్యేది. ఈసారి 8వ తేదీ గడిచినా జీతం అందలేదు. అరకొర జీతాలతో కుటుంబాలను నెట్టుకొచ్చే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతి నెల జీతాలు చెల్లిస్తేకానీ వారి అవసరాలు తీరవు. ఈ సారి అందులోనూ మంగళవారం ఉగాది, 11వ తేదీన పవిత్ర రంజాన్ పండుగలు వచ్చాయి. ఔట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్న వారిలో సగానికి పైగా ముస్లిం ఉద్యోగులే ఉన్నారు. ఈ నెల 5వ తేదీ నుంచి తమ జీతం ఎప్పుడు బ్యాంకు ఖాతాలో జమవుతుందా అని గడియ, గడియకు ఎదురుచూస్తున్న ఉద్యోగులు ఉగాది సందర్భంగా మంగళవారం సెలవు కావడం తో ఆ రోజు కూడా జీతం రాదేమోనని ఆందోళనకు గురవుతున్నారు. ఇదిలా ఉండగా కొందరు ఉద్యోగులు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలకు ఈఎంఐలు సకాలంలో చెల్లించలేక సిబిల్ కోల్పోతున్నామని వాపోతున్నారు. ఖజానాలో టోకెన్ జనరేట్ కానందున జీతాలు జమవడంలో జాప్యం జరిగినట్లు అధికారులు తెలిపారు. మరోకపక్క రాష్ట్ర ఖజానాలో పైసలు లేనందు వల్లే జీతాలు ఆలస్యమవుతున్నాయన్న వాదన వ్యక్తమవుతోంది.

మసీదుల అభివృద్ధికి నిధులేవి?



● జగన్ వచ్చాక పైసా ఇవ్వని ప్రభుత్వం
● రంజాన్ మాసంలోనూ కదలిక కరువు
● చందాలతోనే నిర్వహణ, మరమ్మతులు

ఉదయగిరి, ఏప్రిల్ 8: ముస్లిం పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని గత టీడీపీ ప్రభుత్వం ఏటా మసీదుల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేసేది. వాటితో గ్రామాల్లోని మసీదులకు రంగులు వేయడం, మరుగుదొడ్లు, విద్యుత్ తదితర చిన్నపాటి మరమ్మతులు చేసుకుని రంజాన్ మాసంలో ప్రత్యేక ప్రార్థనలు చేసేవారు. అలాగే ఈద్గాల వద్ద నమాజులకు తగిన ఏర్పాటు చేసుకునేవారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్లయినా ఎలాంటి నిదులు కేటాయించకపోవడంతో ముస్లిం పెద్దలు, సోదరులే చందాలు వేసుకుని పనులు చేసుకుంటున్నారు. జిల్లాలో ఉదయగిరి, ఆత్మకూరు, కావలి, కోవూరు, సర్వేపల్లి, కందుకూరు, నెల్లూరు నియోజకవర్గాల పరిధిలో 700కుపైగా మసీదులున్నాయి. ఎక్కువ మంది మైనారిటీలు రోజువారి కూలి పనులు చేసుకుని జీవించేవారు. గతంలో మసీదుల పరిధిలో ఇనాం భూములుండేవి. వీటి విలువ రూ.కోట్లు పలికినా అధికారుల పర్యవేక్షణలేక కొన్ని అన్యాక్రాంతమయ్యాయి. కనీసం విద్యుత్ బిల్లు చెల్లించాలన్నా దాతల విరాళాలే దిక్కని ముస్లింలు వాపోతున్నారు. ఎన్నికల సమీపంచడం, రంజాన్ మాసం రావడంతో నిధుల మంజూరవుతాయని ముస్లింలు ఎదురుచూశారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో మసీదు కమిటీసభ్యులు దాతల సహకారంతో పనులు చేయించుకున్నారు.

పండ్లకు రసాయనాలు వాడితే కఠిన చర్యలు

● చిన్నబజారులో ఎంహెచ్‌వో తనిఖీ


మార్కెట్లో పండ్లను పరిశీలిస్తున్న ఎంహెచ్‌వో

నెల్లూరు(సిటీ), ఏప్రిల్ 8 : ప్రజారోగ్యంపై ప్రభావం చూపే రసాయనాలతో పండ్లను మాగేస్తే సదరు వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్ఎంసీ ఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణయ్య హెచ్చరించారు. సోమవారం చిన్న బజారులోని పండ్ల మార్కెట్‌లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. స్థానికంగా పలువురు రసాయనాలు వాడి పండ్లు మాగేయడాన్ని గుర్తించిన ఆయన వాటన్నింటిని స్వాధీనం చేసుకుని వాహనాల్లో డంపింగ్ యార్డుకు తరలించి నిర్వీర్యం చేశారు. అనంతరం మాట్లాడు తూ రసాయనాలతో కృత్రిమంగా పండ్లను మాగేస్తు బహిరంగ మార్కెట్లో విక్రయాలకు పాల్పడి తే ప్రజారోగ్య చట్టం కింద శిక్షిస్తామని, అందుకు కఠిన చట్టాలున్నాయని తెలిపారు. అనంతరం పండ్లలో తీపి, రంగు వచ్చేందుకు మరికొందరు వ్యాపారులు రసాయనాలు వాడినట్లు గుర్తించిన ఆయన వారందరికీ జరిమానాలు విధించి నోటీసులు జారీ చేశారు. ఇకపై నిత్యం దాడులు నిర్వహి స్తామని హెచ్చరించారు.

వాహనాల తనిఖీ


వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్పీ ఆరీఫ్ హాఫిజ్

వెంకటాచలం, ఏప్రిల్ 8 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వెంకటాచలం టోల్‌ప్లాజా, పోలీస్ స్టేషన్లను సోమవారం రాత్రి ఎస్పీ కే ఆరీఫ్ హాఫిజ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎలాంటి అక్రమ మద్యం, నగదు, ప్రలోభపరిచే వస్తువులు అరికట్టాలని, చెక్ పోస్టులకు ఇరువైపులా ప్రతి వాహనాన్ని క్షుణంగా తనిఖీ చేయాలన్నారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలన్నారు. వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు. ఆయన వెంట సీఐ రామకృష్ణారెడ్డి, పోలీస్ సిబ్బంది తదితరులున్నారు.

గరళం కాదు.. గంగే...?!



బుచ్చి నగర పంచాయతీలోని పెద్దూరు ప్రాంతంలో ఉన్న కుళాయిల్లో సోమవారం రాత్రి కలుషిత నీరు సరఫరా అయింది. బురద, చిలుము వాసనతో నీరు రావడంతో తాగేందుకు జనం ఇబ్బంది పడ్డారు. ఏళ్లనాటి పైపులైను దెబ్బతినడంతోనే ఇలా జరిగిందని స్థానికులు పేర్కొన్నారు. ఈ నీరు తాగితే రోగాలు రావా ? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. కాగా బోరు పాయింట్ ఫెయిల్ కావడం, ట్యాంకు క్లీన్ చేసినందునే నీరు అలా వచ్చిందని నగర కమిషనర్ రమణబాబు తెలిపారు.

- బుచ్చిరెడ్డిపాళెం

రాజకీయ పార్టీలకు కులాన్ని తాకట్టు పెట్టొద్దు

● గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరసింహులు


విలేకరుల సమావేశంలో గౌడ సంఘ నాయకులు

నెల్లూరు(వీఆర్సీ), ఏప్రిల్ 8: వ్యక్తిగత ప్రయోజనాల కోసం రాజకీయ పార్టీలకు కులాన్ని తాకట్టుపెట్టవద్దని గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉదయగిరి నరసింహులు గౌడ్ హితవు పలికారు. నెల్లూరులోని ఓ హోటల్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమాజంలో అన్ని కులాలకు నేడు సంఘాలు ఉన్నాయన్నారు. ఆ సంఘాల ద్వారా అభివృద్ధికి కృషి చేయాలి తప్ప వ్యక్తిగత ప్రయోజనాలకు వాడుకోకూడదన్నారు. గౌడ సంఘంలో నాయకులుగా చెప్పుకుంటున్న దయాకర్‌గౌడ్, నాగే శ్వరరావుగౌడ్ ఒక రాజకీయ పార్టీకి తొత్తులుగా మారి గౌడ సంఘమంతా ఆ రాజకీయ పార్టీకి మద్దతు తెలుపుతున్నట్లుగా ప్రకటనలు చేయడం వారి వ్యక్తిగత ప్రకటనగానే భావించాలని, గౌడ సంఘానికి ఎలాంటి సంబంధం లేదన్నారు. ఇలాంటి ప్రకటనల జాతికి ఎలాంటి ప్రయోజనం చేకూరదన్నారు. గౌడ కుల సంఘం వీరికి ఎలాంటి అధికా రాలు ఇవ్వలేదని, రాజకీయ పార్టీలు వీరి మోసపు మాటలు నమ్మవద్దని హితవు పలికారు. ఎవరైనా రాజకీయ పార్టీలకు మద్దతు తెలపాలనుకుంటే వారు సంఘంలో ఉన్న పదవులకు రాజీనామా చేసి తమ ఇష్టం వచ్చిన పార్టీలో చేరవచ్చన్నారు. ఈ సమావేశంలో మన్నెం చిరంజీవిగౌడ్, ఉప్పల పరమేష్‌గౌడ్, శ్రీరాములు గౌడ్, అన్నం హరి ప్రసాద్, పర్వతాల శ్రీనివాస్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ కండువా వేసి నగదు ఆశ చూపారు!

● ఆత్మకూరు ఎమ్మెల్యే తీరుపై సంగం సర్పంచు అసహనం

సంగం, ఏప్రిల్ 8 : ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తమ మెడలో వైసీపీ కండువా వేసి మా పార్టీలో ఉండండి నగదు ఇస్తామని చెప్పారని, అయితే తాము అవన్నీ వద్దని వచ్చేశామని సంగం మేజర్ పంచాయతీ సర్పంచు నిమ్మళ్ల రమణమ్మ తెలిపారు. స్థానిక టీడీపీ నాయకులు కర్నాటి రవీంద్రరెడ్డి ఇంట్లో ఆమె విలేకరులతో ఈ విషయం తెలిపారు. కర్నాటి రవీంద్రారెడ్డి మాట్లాడుతూ సంగం ప్రజలెవరూ అమ్ముడుపోరని ఎమ్మెల్యే గుర్తించాలన్నారు. 'గౌరవం, గుర్తింపు లేనిచోట ఉండలేనని, కనీసం గ్రామాభివృద్ధి పనులకు కూడా నిధులు కేటాయించనందున తాను వైసీపీని వీడి టీడీపీలో చేరుతున్నాని ఆనాడే చెప్పా. ఇప్పుడు గిరిజన మహిళయిన సర్పంచు నిమ్మళ్ల రమణమ్మ, ఈమె భర్త అంకయ్యను మాట్లాడాలని పిలిచి పార్టీ కండువా కప్పి నగదు ఆశ చూపడం మంచి పద్ధతి కాదు.' అని హితవు పలికారు.

వృద్ధులకు పింఛన్ పంపిణీ

నెల్లూరు(సాంస్కృతికం), ఏప్రిల్ 8 : నగరంలోని రంగనాయకులపేట ది బులియన్ మర్చంట్స్ కల్యాణ మం డపంలో ది ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్ అండ్ పాన్‌బ్రో కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా ది క్లాత్ మ ర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తాతా వెంకట కిషోర్ పాల్గొని 65 మందికి రూ.వెయ్యి వంతున అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్ అసోసియేష న్ అధ్యక్షుడు అమరా మోహన్‌రావు, కార్యదర్శి ఎంపీ ఆంజనేయులు, కోశాధికారి కోనగళ్ల శోభన్‌బాబు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఎడగారు లేనట్టేనా..?

● కానరాని సాగు నీటి లభ్యత ● బోర్లు కింద మాత్రమే సాగుకు సన్నద్ధం


ట్రాక్టర్‌తో ఎల్లి దుక్కి చేస్తున్న రైతు

నెల్లూరురూరల్, ఏప్రిల్ 8 : రబీ వ్యవసాయ సీజన్ పూర్తవుతోంది. ఎడగారులో పంటల సాగు ప్రశ్నార్థకంగా మారింది. సాగు నీటి లభ్యత లేకపోవడంతో ఏమి చేయాలో తెలియక రైతులు అయోమయ దుస్థితిని ఎదుర్కొంటున్నారు. దీంతో ఈ సారి మాగాణి భూములు బీడు పెట్టుకోవడం ఉత్తమమని మెజార్టీ రైతాంగం అభిప్రాయపడుతున్నారు. వరికి ప్రత్యామ్నాయ పంటలు వేసేందుకు కూడా నీటి వసతి అందుబాటులో లేకపోవడంతో ఎడగారుకు హాలిడే ప్రకటించే క్రమంలో మాగాణి రైతాంగం ఉంది. అయితే బోర్ల కింద నీటి సౌకర్యం కలిగిన రైతులు మాత్రం మళ్లీ వరి సాగు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. నెల్లూరుకు తూర్పు, పడమరనున్న గ్రామాల్లో సుమారు 30 వేల ఎకరాలు వ్యవసాయ భూములున్నాయి. తూర్పు పల్లెల్లో బోరల వసతి ఉంది. కానీ పడమర గ్రామాలన్నీ పారుదల సౌకర్యం కలిగినవి కావడంతో ఎడగారు సేద్యం ఆందోళనకరంగా మారింది. ప్రధాన సాగునీటి వనరులైన కనుపూరు కాలువ, నెల్లూరు కాలువలకు ఎడగారులో రెండో పంటకు నీరందించే అవకాశం లేకపోవడంతో మాగాణి భూములు ఎండపెట్టుకోవాల్సి దుస్థితి ఏర్పడింది. ప్రస్తుతం ముగుస్తున్న రబీ కోతలు పూర్తయిన వెంటనే పత్తి, పెసర, కూరగాయలు సాగు చేయాలని మాగాణి రైతులు సిద్ధపడినప్పటికీ సాగునీటి జాడ లేకపోవడంతో సాహసం చేయలేకపోతున్నారు. చెరువులు, కాలువల్లో ఇప్పుడున్న అరకొర నీటి వసతితో ఆరుతడి పంటలు సాగు చేసినా పూత, కాయ దశకొచ్చే సరికి నీటి కొరత వల్ల అవి ఎండిపోయి పెట్టుబడులను కోల్పోవల్సి వస్తుందని గ్రహించి ఎడగారుకు విరామం ప్రకటించేందుకు సిద్ధమయ్యారు. ఇదిలా ఉండగా బోర్ల కింద నీటి వసతులున్న రైతులు మాత్రం ప్రాధాన్యత క్రమంలో కేఎన్ఎం 733, 1638, ఆర్ఎన్ఆర్ 15048 రకాలనూ, ఎంటీయూ 1010 (లావులు) రకం రెండవ పంట సాగు చేసేందుకు సిద్ధపడుతున్నారు.

ఎడగారులో ఆరుతడి పంటలు మేలు

● జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి

నెల్లూరు రూరల్, ఏప్రిల్ 8 : వరి సాగు పూర్తయినందున తదుపరి ఎడగారు సీజన్‌లో ఆరుతడి పంటలు వేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి పీ సత్యవాణి రైతులకు సూచించారు. సోమవారం మండలంలోని మాదరాజు గూడూరులో పర్యటించిన ఆమె ధాన్యం రాశుల వద్ద మద్దతు ధరపై ఆరా తీశారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ ఎడగారులో వరికి సరిపడ సాగునీరు లేనందున ఆరుతడి పంటలు వేసుకుంటే ప్రయోజనం ఉంటుందన్నారు. ఆ దిశగా సంసిద్ధం కావాలని సూచించారు. ప్రభుత్వ మద్దతు ధరకంటే బయట మార్కెట్లో ధరలే ధాన్యానికి ఎక్కువగా ఉన్నందున రైతులకు ప్రయోజనం కలుగు తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ శ్రీనివాసులు, ఏవో నాగమోహన్, తదితరులు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న డీఏవో సత్యవాణి

సోమశిలలో 8.993 టీఎంసీల నిల్వ

అనంతసాగరం: సోమశిల జలాశయం పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా ఆదివారానికి ప్రాజెక్టులో 8.993 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. దిగువ ఉత్తర కాలువకు 50 క్యూసెక్కులు, డెల్టాకు 400, దక్షిణ కాలువకు 50 క్యూసెక్కులు చొప్పున నీటిని వదులుతున్నట్లు తెలిపారు.


నవ వధువుకు పెళ్లికానుక అందజేస్తున్న కాకర్ల సురేష్

ఆయనో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్.. హాయిగా సాగిపోయే జీవితం.. అయినా ఆయన అంతరంలో ఏదో అసంతృప్తి. తాను బాగా ఉండటమే కాకుండా పుట్టిన గడ్డపై ఉన్న ప్రతిఒక్కరూ సంతోషంగా ఉండాలని.. పేద పిల్లలకు చక్కని చదువులు అందించాలని, రోగాలతో బాధపడుతున్న బడుగుల బతుకుల్లో ఉపశమన కాంతులు నింపాలని, దప్పికతో పిడస గట్టుకుపోతున్న పల్లెల గొంతులకు, మూగజీవాలకు గుక్కెడు నీరందించాలని.. ఇలా ఎన్నెన్నో ఆలోచనలు.. ఈ క్రమంలోనే ఆ ఆలోచనలకు కార్యరూపం ఇవ్వడం ఆరంభించారు. ఆ ఫలితాల ఆనందంతో మరింతగా సమాజసేవ చేయాలనే సంకల్పంతో ఓ ట్రస్టును ఏర్పాటు చేశారు. అంతేసేవలు ఎన్నో రెట్లు పెరిగాయి. ఎంతోమంది వాటి ఫలాలు అందుకొంటున్నారు. సమాజసేవకు తన ప్రవృత్తిగా మార్చుకున్న ఆ ఎన్ఆర్ఐ కాకర్ల సురేష్. ఆయన ప్రారంభించిన సమాజ సేవా నేస్తమే కాకర్ల చారిటబుల్ ట్రస్టు.


గ్రామపెద్దల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న సురేష్

'కాకర్ల' సేవలతో మురిసి!

ఆలోచనతో అడుగేసి..

- ఉదయగిరిలో విద్యా, వైద్యం ఉపాధి కల్పనతో విస్తృత సేవలు
- పేదల ఆకలి తీర్చుతున్న అన్నా క్యాంటీన్
- అభాగ్యులకు ఆర్థిక అండదండలు
- యువత భవిష్యత్తుకు భరోసా
- మానవత్వం చాటుకుంటున్న కాకర్ల సురేష్

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 8: ఉదయగిరి నియోజకవర్గం మెట్టప్రాంతం. సమయానికి వర్షాలు కురవక కష్టాలు చవిచూసే రైతులు, కనీస కూలి పనులు లేక ఊళ్లకు ఊళ్లే వలసలు వెళ్లే పరిస్థితులు. ఉపాధి లేక అల్లాడే యువత, చిన్న వ్యాపారాలకూ ఆర్థిక ఇబ్బందులు పడే చిరువ్యాపారులు, సమయానికి వైద్యం అందక మృత్యువాతపడే అభాగ్యులు. ఇలా కన్నీరు పెట్టించే బాధలు కాకర్ల సురేష్‌ని కలిచివేశాయి. సొంత ప్రాంతానికి ఏదో చేయాలనే తపనతో విదేశాలను వదిలి ఉదయగిరిలో అడుగుపెట్టేలా చేశాయి. తనవంతుగా తమ ప్రాంత ప్రజలకి మరిచిపోలేని మేలు చేయాలని, అందర్నీ ఉన్నత మార్గంలో నడిపించాలనే మహోన్నత లక్ష్యంతో ముందడుగు వేశారు. కాకర్ల చారిటబుల్ ట్రస్టును స్థాపించి విద్యా, వైద్యం, ఉపాధితోపాటు పలు విస్తృత కార్యక్రమాలు నిర్వహిస్తూ మానవత్వం చాటుకుంటున్నారు సురేష్.

● సామాన్య కుటుంబం

వరికుంటపాడు మండలం యర్రంరెడ్డిపల్లిలోని కాకర్ల వెంకటసుబ్బానాయుడు, ప్రమీల దంపతులకు సురేష్, సునీల్‌లు సంతానం. రెవెన్యూ శాఖలో వెంకటసుబ్బానాయుడు వీడీవోగా పని చేసేవారు. చిన్నప్పటి నుంచి సురేష్, సునీల్ కష్టపడి చదువుకునే వారు. సురేష్ చిన్నతనం నుంచే నాయకత్వ లక్షణాలు పుణికి పుచ్చుకున్నాడు. హైస్కూల్‌లో చదివే రోజుల్లోనే విద్యార్థి సంఘంలో చురుగ్గా ఉండేవాడు. సురేష్ ఇంజనీరింగ్, సునీల్ పశువైద్యంలో ఉన్నత చదువులు అభ్యసించారు. చదువుల్లో ఉన్నతంగా రాణిస్తూ తల్లిదండ్రులకి పేరు తెచ్చారు.


శిక్షణ పొందిన మహిళలతో కాకర్ల సురేష్


అన్నా క్యాంటీన్‌లో భోజనం వడ్డిస్తున్న కాకర్ల ట్రస్ట్ అధినేత సురేష్

● సేవలతోనే సంతృప్తి

అన్నదమ్ములిద్దరూ 2000 సంవత్సరంలో అమెరికాకు వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. అమెరికా దేశానికి వెళ్లి జీవితం హాయిగా గడిచిపోతున్నా సురేష్‌లో ఏదో వెలితి అనిపించేది. కేవలం మనం, మన కుటుంబమే కాదు. మన తెలగువారికి, తోటివారికి సాయం చేయాలని తపనపడేవారు. అలా నార్త్ కెరిలినా తెలుగు అసోసియేషన్‌కి 15 ఏళ్లపాటు అధ్యక్షుడిగా పని చేశారు. తానా రీజనల్ ఉపాధ్యక్షుడిగానూ పని చేసి ప్రముఖుల ప్రశంసలు అందుకున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి అమెరికాకు వెళ్లి ఆర్థిక ఇబ్బందులు పడే విద్యార్థులు, అకస్మాత్తుగా అనారోగ్యానికి గురై, బీమా వంటివి లేక ఇబ్బందులు పడేవారికి సంస్థల ద్వారా వెన్నుదన్నుగా నిలిచేవారు. కొందరు అమెరికాలో మృతి చెందగా, ఇండియాలో వారి కుటుంబాలు కడచూపు కోసం వేడుకుంటూ ఉండేవారు. అలాంటి సందర్భాల్లో వారి పార్థీవదేహాలను స్వగ్రామాలకు పంపించేందుకు రోజుల తరబడి పనిచేసేవారు. ఇలా సురేష్ ఎన్నెన్నో సేవలు చేస్తుండేవారు. అలా అమెరికాలో ఉన్నన్ని రోజులు తోటి వారికి సేవ చేస్తూ ఆనందించేవారు.


తన ట్రస్టు ద్వారా క్రీడలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తూ..


రైతులకు పవర్ స్ప్రేయర్లు పంపిణీ చేస్తూ..

● కొవిడ్ సమయంలో నిరుపమాన..

ప్రపంచాన్ని కోవిడ్ మహమ్మారి గజగజ వణికిస్తూ అందరూ ఇళ్లకే పరిమితమైనప్పుడు సురేష్ నిరుపమైన సేవలకు శ్రీకారం చుట్టారు. తానా సంస్థలోని టీం స్క్వేర్ టీంకి కో-చైర్మన్‌గా మిగిలిన సభ్యులతో కలిసి సంపూర్ణ బాధ్యతలు నిర్వర్తించారు. తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో రూ.4 కోట్లతో ఆక్సిజన్ వెంటిలేటర్లు ఏర్పాటు చేయించారు. ఇలా తానా టీమ్ స్క్వేర్ ద్వారా ఎంతో మంది ప్రాణాలు కాపాడగలిగారు. అలాగే 15వేల మెడికల్ కిట్లు అందించారు. కోవిడ్ మహమ్మారి ప్రపంచమంతా జడలు విప్పి కరాళనృత్యం చేస్తున్న సయంలో సురేష్ తనవంతుగా తెలుగురాష్ట్రాల ప్రజల కోసం క్రియాశీలక పాత్ర పోషించారు. ఏపీ గవర్నర్ చేతుల మీదుగా తానా టీం స్క్వేర్ తరుపున అవార్డును అందుకున్నారు.

● మెట్ట వాసుల కష్టాలు చూడలేక



ఉదయగిరి నియోజకవర్గంలోని మెట్టప్రాంత ప్రజల కన్నీటి కష్టాలని చూసి కాకర్ల సురేష్ చలించి పోయారు. తాను ఏదోలా తనవాళ్లకి సాయపడాలని నిర్ణయించుకున్నారు. ఆరు నెలలపాటు ప్రజల జీవన విధానం, ఆర్థిక స్థితిగతులు, అవసరాలు, సమస్యలపై సర్వే చేయించారు. నియోజక వర్గంలోని ఉదయగిరి, సీతారామపురం, దుత్తలూరు, వరికుంటపాడు, వింజమూరు, కలిగిరి, కొండాపురం, జలదంకి మండలాల్లోని మారుమూల గ్రామాల్లో పరిస్థితులన్నీ అంచానా వేశారు. 2021 అక్టోబరులో కాకర్ల చారిటబుల్ ట్రస్టుని ఏర్పాటు చేశారు. అప్పటినుంచి ట్రస్టు తరుపున రూ.కోట్లతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

చంద్రబాబు వల్లే ఇంతస్థాయికి ఎదిగా!

మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అంటే తనకు వీరాభిమానం. చిన్నతనం నుంచి అయన్నే ఆదర్శంగా తీసుకుని ముందుకు నడిచా. ఆయన వేసిన ఐటీ బీజం నుంచే తాను ఇంతస్థాయికి ఎదిగా. చంద్రబాబు రాష్ట్రానికి ఐటీ రంగాన్ని పరిచయం చేసిన క్రమంలో తాను ఆ రంగంలోకి ప్రవేశించా. కష్టపడి ఎదిగా. సాధారణ ఉద్యోగిగా విదేశాల్లో అడుగుపెట్టి పారిశ్రామికవేత్తగా గుర్తింపు పొందా. యువనేత లోకేష్ సిద్ధాంతాలు, వ్యక్తిత్వం తనపై ఎంతో ప్రభావం చూపాయి. పుట్టిన గడ్డకు సేవ చేయాలనే తలంపుతో ఇక్కడికి వచ్చా. తన సొంత నిధులతో సేవా కార్యక్రమాలు చేస్తున్నా. వైద్యసేవలు అందిస్తున్నా. పేదలకు సాయం చేసినపుడు కలిగే తృప్తి ఎందులోనూ లేదు. జీవితాంతం తనవంతు ప్రజలకు సేవ చేస్తూనే ఉంటా. వెనుకబడిన ఉదయగిరి ప్రాంతంలో సాగు, తాగునీటి కష్టాలు తీర్చడంతో పాటు వలసల నివారణకు పరిశ్రమలు స్థాపించాలన్నదే తన ఆకాంక్ష. అందుకనే ఉదయగిరి అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తున్నా. మీరు నన్ను ఆశీర్వదించి గెలిపిస్తే ఉదయగిరిని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తా.




సేవా కార్యక్రమాలు.. ప్రజల మన్ననలు...

- వింజమూరులో అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేసి 300రోజులకుపైగా ప్రతిరోజూ సరాసరి 600 మందికి రూ.5లకే నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించారు. మధ్యాహ్న సమయంలో ఆకలితో ఇబ్బండిపడే పేద, నిరుపేదల కడుపు నింపారు. వింజమూరుకి పలు పనుల మీద వచ్చే రైతులు, చిరుద్యోగులు, విద్యార్థులు భోజనం చేసి తృప్తిగా వెళుతున్నారు.
- ప్రకాశం జిల్లా మార్కాపురంలో సంజీవనీ ఆరోగ్య రథాన్ని టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు చేతులమీదుగా ప్రారంభించారు. అప్పటినుంచి ఉదయగిరి నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి వెళ్లి వైద్యసేవలు అందిస్తున్నారు. ఉచితంగా అత్యాధునిక పరీక్షలు నిర్వహించి మేలు రకం మందులు అందిస్తున్నారు. ఇప్పటివరకు 28 వేల మందికిపైగా ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.
- గ్రామాల్లో ఉచిత కంటి వైద్యశిబిరాలు నిర్వహించి వేలాది మందికి పరీక్షలు నిర్వహించారు. 70మందికిపైగా ఉచిత కంటి శస్త్రచికిత్సలు చేయించారు. 1,150 మందికి కంటి అద్దాలు అందజేశారు.
- వింజమూరులో ఉచిత టైలరింగ్, బ్యూటీషియన్ కోర్సులు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు 500మందికి ఆయా రంగాల్లో నిపుణులతో శిక్షణ ఇప్పించి ధ్రువపత్రాలు అందజేశారు. పరిశ్రమలు, సంస్థలతో సంప్రదించి వందలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించారు. మరికొందరికి వారి గ్రామాల్లోని ఇంటి వద్ద స్వయం ఉపాధి కోసం కుట్టుమిషన్లు, బ్యూటీషియన్ సామగ్రి కోసం ఆర్థికసాయం చేశారు.
- డ్రైవింగ్ శిక్షణ సంస్థ ద్వారా యువకులకు డ్రైవింగ్‌లో శిక్షణ ఇప్పించడంతోపాటు లైసెన్సులు ఇప్పించారు. 40 మందికిపైగా డ్రైవింగ్‌తో ఉపాధి పొందే వీలు కల్పించారు.
- అనారోగ్యంతో ఆర్థికంగా చితికిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్న 2,500మందికి వారి పరిస్థితులని బట్టి రూ.10నుంచి 2లక్షల వరకు ఆర్థికసాయం అందజేశారు.
- పేదల ఇళ్లలో జరిగే వివాహాలకి హాజరై 600 కుటుంబాలకి ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున పెళ్లి కానుక అందజేశారు.
- యువత క్రీడల్లో రాణించేలా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వాలీబాల్, క్రికెట్, కబడ్డీ పోటీలు నిర్వహించి క్రీడాకారులను ప్రోత్సహించారు.
- సంక్రాంతి పర్వదినం రోజు ఆటల పోటీలు, ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.
- గ్రామశివారు, అటవీ ప్రాంతాలకు సమీపంలో తొట్లు నిర్మించి అందులో నీరు నింపి మూగజీవాల దాహార్తి తీర్చుతున్నారు.
- వేసవి కాలంలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తి తీర్చారు.
- గ్రామాల్లో సమస్యలన్నీ గుర్తించి వాటి పరిష్కారానికి తమవంతు కృషి చేస్తున్నారు. ఒక్కో ప్రాంతంలో రూ.50 వేల నుంచి 2లక్షల వరకు ఖర్చు పెడుతూ 20కిపైగా రోడ్ల మరమ్మతులు, బోర్లు నిర్మాణం వంటివి చేపట్టారు.
- వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్న సమయంలో రైతులకు పవర్ స్ప్రేయర్లు దొరక్క ఇబ్బందులు పడుతుండేవారు. 200కిపైగా పవర్ స్ప్రేయర్లు పంపిణీ చేశారు. ఆయా ప్రాంతాల్లో రైతులు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేశారు. వాటికి అవసరమైన మరమ్మతులు చేయిస్తున్నారు.
- 100మందికి చిరు వ్యాపారులకు తోపుడుబండ్లు ఇప్పించి వారి ఇళ్ల వద్దకే చేర్చారు.
- అగ్ని ప్రమాదాలు, విపత్తులతో పూర్తిగా నష్టపోయిన 40 కుటుంబాలకు ఆర్థికంగా ఆదుకున్నారు. 40 కుటుంబాలకు రూ.50వేల నుంచి రూ.2లక్షల వరకు ఆర్థికంగా సహాయం చేశారు.


కాకర్ల ట్రస్ట్ ద్వారా పేదలకు ఆర్థికసాయం అందజేస్తున్న సురేష్


సంజీవని ఆరోగ్య రథంలో కాకర్ల సురేష్


దివ్యాంగుడికి ఆర్థికసాయం చేస్తున్న కాకర్ల సునీల్

అధికార పక్షం పునాదులు కదులుతున్నాయి

● స్టాబీడీ కాలనీ ప్రచారంలో టీడీపీ అభ్యర్థి ప్రశాంతిరెడ్డి

కోవూరు, ఏప్రిల్ 8: తెలుగుదేశం పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పడుతుండటంతో అధికార పక్షం పునాదులు కదులుతున్నాయని టీడీపీ కోవూరు నియోజకవర్గ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. స్థానిక స్టాబీడీ కాలనీ, లక్ష్మీనారాయణ పురంలో ఆమె సోమవారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. కోవూరు, పడుగుపాడు పంచాయతీ పరిధిల్లోని వార్డు సభ్యులు పెద్ద సంఖ్యలో టీడీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటమి భయంతో వైసీపీ నాయకులు ఇష్టానుసారం మాట్లాడుతున్నారన్నారు. నియోజకవర్గ ప్రజలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా జీవించేందుకు కృషి చేస్తామన్నారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రతీ ఇంటికీ తాగునీరు అందిస్తామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడును ఎన్నుకోవాల్సిందిగా కోరారు. పార్లమెంటు స్థానానికి పోటీచేస్తున్న తన భర్త వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని, కోవూరు అసెంబ్లీ స్థానానికి పోటీచేస్తున్న తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిందిగా ఆమె కోరారు. లక్ష్మీనారాయణ పురంలోని కోదండరామస్వామి ఆలయంలో పూజల అనంతరం ప్రచారం చేశారు. గ్రామానికి వచ్చిన ప్రశాంతిరెడ్డికి పెద్దసంఖ్యలో టీడీపీ కార్యకర్తలు, మహిళలు ఘన స్వాగతం పలికారు. వైసీపీకి చెందిన కొండూరు బాలయ్య, కొండూరు గోపీకృష్ణ, కూనంగారి గోపాల్, పామంజి శ్రీనివాసులు నాయకత్వంలో పెద్దసంఖ్యలో టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జాతీయ కమిటీ అధికార ప్రతినిధి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, పార్లమెంటు కమిటీ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, నాయకులు ఇంతా మల్లారెడ్డి, నాటకరాని వెంకట్ తదితరులు పాల్గొన్నారు. పెద్దసంఖ్యలో బీజేపీ, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు. మత్స్యకార కాలనీ లక్ష్మీనారాయణ పురంలో ప్రశాంతిరెడ్డికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. ఈకార్యక్రమంలో సూరిశెట్టి శ్రీనివాసులు, చిన్ని వెంకటేశ్వర్లు, కాటంగారి దిలీప్‌కుమార్, కొండూరు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.


లక్ష్మీనారాయణపురంలో కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

ఇనమడుగులో వేమిరెడ్డి దంపతుల ప్రచారం

నెల్లూరు పార్లమెంటు టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సోమవారం కోవూరు అసెంబ్లీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డితో కలిసి ఇనమడుగు గ్రామంలో ప్రచారం చేపట్టారు. ఈసందర్భంగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా సమగ్రాభివృద్ధికి తనను ఎంపీగా, ప్రశాంతిరెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించాల్సిందిగా కోరారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడును ఎన్ను కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ కమిటీ అధికార ప్రతినిధి పోలం రెడ్డి దినేష్‌రెడ్డి, టీడీపీ నాయకులు కొల్లారెడ్డి సుధాకర్ రెడ్డి, సునీల్‌రెడ్డి, ఆదిశేషారెడ్డి, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

ప్రజాసేవకే రాజకీయాల్లోకి వచ్చాం

బుచ్చిరెడ్డిపాళెం: ప్రజలకు సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చామని వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. సోమవారం వేమిరెడ్డి దంపతులు, పోలం రెడ్డి దినేష్‌రెడ్డితో కలిసి మండలంలోని నాగామాంబాపురం, పాతకొండూరుపాళెం, విలియమ్స్‌పేట(కొట్టాలు) గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించి ప్రజలను ఓట్లు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ఒంటేరు గిరి, కత్తి మహేష్, వల్లూరు, రాఘవరెడ్డి, పుట్టా సుబ్రమణ్యంనాయుడు, ఎంపీ శేషయ్య మైనారిటీ, దళిత నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

వీపీఆర్ దంపతులను ఆదరించండి

విడవలూరు: ఎన్నికల్లో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతులను గెలిపించాలని కోరుతూ వారి కుమారుడు అర్జున్‌రెడ్డి, కోడలు ఆయిషాతారెడ్డిలు సోమవారం దండిగుంట, వరిణి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక టీడీపీ నాయకుడు కుడుముల మల్లికార్జున ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న అర్జున్‌రెడ్డి, అయిషాతారెడ్డిలను స్థానికులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మద్దులూరి సునీల్, సోమయ్య, రాజా, వెంకటస్వామి, బాబారావు, ఏసోబు తదితరులు పాల్గొన్నారు.

కాకాణిని తరిమికొడదాం : సోమిరెడ్డి


టీడీపీలో చేరిన వారితో సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి

నెల్లూరు(వ్యవసాయం), ఏప్రిల్ 8: సర్వేపల్లి నియోజకవర్గాన్ని సర్వనాశనం చేసిన మంత్రి కాకాణిని తరిమి కొట్టేందుకు ప్రజలు తరలిరావాలని టీడీపీ జాతీయ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం వేదాయపాళెంలోని సోమిరెడ్డి కార్యాలయంలో పలువురు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ముత్తుకూరు మండలం సీవీఆర్ ఆదాలనగర్‌కు చెందిన 9 కుటుంబాలు, మనుబోలు మండలం వీరపల్లి పంచాయితీ పరిధిలోని ఎస్సీ కాలనీకి చెందిన 11 కుటుంబాలు, తోటపల్లిగూడూరు, ముత్తుకూరు మండలాల నుంచి పెద్దసంఖ్యలో టీడీపీలో చేరారు. సోమిరెడ్డి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈకార్యక్రమాల్లో ఆయా మండలాల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వల్లూరు పంచాయతీలో సోమిరెడ్డి ప్రచారం

ముత్తుకూరు: మండలంలోని వల్లూరు పంచాయతీ చుట్టుగుంట, పచ్చికాయలమిట్ట, రామాపురం, అచ్చన్నతోపు, బండ్లపాలెం గ్రామాలలో సోమవారం సోమిరెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, నాయకులు మునిరెడ్డి, మల్లికార్జునయాదవ్, పల్లికొండ శ్రీనివాసులు, వల్లూరు మోహన్‌రావు, కోట చరణ్, శివయ్య, నరసారెడ్డి, షఫీవుల్లా, బీజేపీ నాయకులు రవీంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తండ్రి కోసం తనయుడి ప్రచారం

మనుబోలు: తన తండ్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని గెలిపించాలంటూ తనయుడు సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మండలంలోని అక్కంపేట గ్రామంలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సైకిల్ గుర్తుకే ఓటేయాలంటూ ఇంటింటా ప్రచారంలో కోరారు. ప్రచారంలో పలు గిరిజన కుటుంబాలు పార్టీలో చేరగా, వారికి కండువాలు వేసి ఆయన స్వాగతించారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు గాలి రామకృష్ణారెడ్డి, నాయకులు కోదండరామిరెడ్డి, ఆంజనేయులు, వేణుగోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సోమిరెడ్డిని గెలిపించుకుందాం

వెంకటాచలం: ఎన్నికల్లో సర్వేపల్లి ఎమ్మెల్యేగా కూటమి తరపున పోటీచేస్తున్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి ఓట్లువేసి గెలిపించాలని సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సతీమణి సోమిరెడ్డి శృతిరెడ్డి కోరారు. మండలంలోని తిరుమలమ్మపాళెంలో సోమవారం సాయంత్రం ఎన్నికల ప్రచారంలో ఆమె పాల్గొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్, నాయకులు పర్రి మల్లికార్జున్, తదితరులున్నారు.

జగన్ పాలనలో అభివృద్ధి శూన్యం

● వెంకటగిరి టీడీపీ అభ్యర్థి లక్ష్మీసాయి ప్రియ


కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ అభ్యర్థి లక్ష్మీసాయి ప్రియ

సైదాపురం, ఏప్రిల్ 8: సీఎం జగన్మోహన్‌రెడ్డి దోచుకోవడం.. దాచు కోవ డం తప్ప అభివృద్ధి చేపట్టలేదని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ అన్నారు. సోమవారం రాత్రి మండలం లోని మునగపాడు, తోచాం, కృష్ణారెడ్డిపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సైకిల్ గుర్తుకు ఓటువేసి తనను ఆశీర్వదించి అసెంబ్లీకి పంపాలని ఓటర్లను కోరారు. మునగపాడుకు రహదారి సౌకర్యం లేకపోవడం దారుణమన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే రోడ్డు, మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. మునగపాడు గ్రామంలో వైసీపీకి చెందిన 20 గిరిజన కుటుంబాలు, కృష్ణారెడ్డిపల్లి గ్రామంలో వైసీపీకి చెందిన 10 కుటుంబాలు టీడీపీ కండువా వేసుకున్నారు. కార్యక్రమంలో పెంచలకోన ట్రస్ట్‌బోర్డు మాజీ ఛైర్మన్ తానంకీ నానాజీ, టీడీపీ మండల అధ్యక్షుడు కట్టా మోహన్‌కృష్ణారెడ్డి, తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ రైతు ఉపాధ్యక్షుడు కొండూరు సుబ్రహ్మణ్యం రాజు, పార్లమెంట్ నియోజకవర్గం టీడీపీ తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ వరద బండి వెంకటేశ్వర్లు రెడ్డి, మండల టీడీపీ తెలుగు యువత అధ్యక్షుడు పద్దాల కిరణ కుమార్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో నష్టపోయింది బీసీలే..!

పొదలకూరు, ఏప్రిల్ 8: సీఎం జగన్ పాలనలో నష్టపోయింది బీసీలేనని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర అన్నారు. సోమవారం తాటిపర్తిలోని ఓ భవనంలో జయహో బీసీ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ నాయకులు పల్లారపు కృష్ణాయాదవ్, వెంపులూరు రామకృష్ణ, కండే మస్తాన్‌యాదవ్, ముక్కు రామయ్య అయోధ్యగౌడ్ మాట్లాడుతూ బలహీన వర్గాల సంక్షేమం టీడీపీకే సాధ్యమన్నారు. ఎన్నికల్లో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి గెలుపు తథ్యమన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, పట్టణ అధ్యక్షులు బొద్దులూరు మల్లికార్జున్‌నాయుడు, పాల్గొన్నారు.

ఇందుకూరుపేట: బీసీల అభ్యున్నతికి పాటుబడిన మహోన్నత వ్యక్తి దివంగత ఎన్టీఆర్ అని మండల కన్వీనర్ రావెళ్ల వీరేంద్రచౌదరి అన్నారు. మండలంలోని పాములవారిపాలెం గ్రామంలో సోమవారం జయహో బీసీ సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్నా మాట్లాడుతూ గత ఎన్నికల్లో జగన్మోహన్‌రెడ్డి వాగ్దానాలు చేసి దగా చేశాడన్నారు.

సాయి దర్బార్‌లో
ఉగాది, శ్రీరామ నవమి వేడుకలు


అఖండ సాయి నామ సంకీర్తన చేస్తున్న సాయి భక్త బృందం

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 8 : నగరంలోని బాలాజీనగర్ శ్రీసాయిదర్బార్‌లో సోమవారం నుంచి ఉగాది, శ్రీరామనవమి వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలు 15వ తేదీ వరకు జరుగుతాయి. ఉదయం 6గంటలకు అఖండ జ్యోతి ప్రజ్వలన జరిగింది. షిరిడీ సాయికి విశేష పూలంగిసేవ, అఖండనామ సంకీర్తనలు జరిగాయి. ఈ కార్యక్రమాలను మందిరం అధ్యక్షుడు మధుసాయి, గౌరవ సలహాదారులు పాబోలు రామసుబ్బయ్య, సాయి, భక్త బృందం పర్యవేక్షించారు.

రంగడి ఆలయంలో ప్రసాదాల వితరణ

తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో మంగళవారం ఉదయం 7గంటల నుంచి ఉగాది పర్వదినం సందర్భంగా భక్తులకు ఉచిత ప్రసాదాలు పంపిణీ చేస్తున్నట్లు జైశ్రీరామ్ హనుమాన్ భక్త బృందం తరపున పాదర్తి బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు.

● నగరంలోని గాంధీనగర్ షిరిడీ సాయిబాబా మందిరంలో శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు నిర్వహిస్తున్నట్లు మందిరం ఛైర్మన్ మన్నెం అమరనాథ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

రెడ్‌క్రాస్‌లో ముందస్తు ఉగాది వేడుకలు

నెల్లూరు(వైద్యం), ఏప్రిల్ 8 : నగరంలోని రెడ్‌క్రాస్ దివ్యాంగుల కేంద్రంలో రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యుడు రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం ముందస్తు ఉగాది వేడుకలు నిర్వహించారు. అందరికీ ఉగాది పచ్చడి అందజేశారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల కేంద్రం ప్రిన్సిపాల్ గురునాథం, వైస్ ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరి, సభ్యులు అరుణమ్మ, నవీద్ అక్తర్, వావిళ్ల నవీన్, సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైసీపీ బెదిరింపులకు వలంటీర్లు భయపడొద్దు

● రూరల్ టీడీపీ అభ్యర్థి శ్రీధర్‌రెడ్డి


పార్టీలో చేరిన యువతతో శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, ఏప్రిల్ 8: వైసీపీ నాయకుల బెదిరింపులకు భయపడి వలంటీర్లు రాజీనామాలు చేసి ఐదేళ్ల సీనియార్టీని కోల్పోవద్దని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కూడా మీ సేవలు యధావిధిగా కొనసాగుతాయని నెల్లూరురూరల్ టీడీపీ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన వెంగళరావు నగర్, మండలంలోని ఉప్పుటూరు, కందమూరు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తమ పార్టీ అధికారంలోకి వచ్చాక వలంటీర్లకు మరింత గుర్తింపునిచ్చి గౌరవిస్తామన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అవ్వ, తాతలకు పింఛన్ రూ.4వేలు, దివ్యాంగులకు రూ.6 వేలు చొప్పున అందజేస్తామన్నారు. అనంతరం ఆకుతోట వద్ద లయన్స్‌క్లబ్‌లో ఆత్మీయ సమావేశం నిర్వహించి స్థానిక ప్రాంతానికి చెందిన బెల్లంకొండ గిరీష్, పంట్రాంగి రమేష్, వినయ్‌ల మిత్రబృందానికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆదేవిధంగా 36వ డివిజన్ బట్వాడిపాళెం చంద్రశేఖర్ మిత్ర బృందం, 29వ డివిజన్ వెంకటరెడ్డినగర్‌కు చెందిన స్థానికులును పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం కస్తూరిదేవి గార్డెన్స్‌లో జరిగిన జిల్లా క్రైస్తవుల ఆత్మీయ సమావేశంలో వీపీఆర్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ పోరాట ఫలితమే తాగునీటి సరఫరా

● రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి


ఎన్నికల ప్రచారంలో కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి

నెల్లూరు(వెంకటేశ్వరపురం) ఏప్రిల్ 8 : తూర్పు ప్రాంతాలకు పెన్నా నీరు సరఫరా తెలుగుదేశం పోరాట ఫలితమేనని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసు లురెడ్డి పేర్కొన్నారు. నగరంలోని 14వ డివిజన్ పరిధిలోని పద్మావతినగర్, శ్రీనివాసనగర్ తదితర ప్రాంతాల్లో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కోటంరెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంతాలకు తాగునీరు ఇవ్వాలని 2000 సంవత్సరం నుంచి పోరాటాలు చేశామన్నారు. దాని ఫలితంగానే సంగం బ్యారేజ్ నుంచి నీరు అందిస్తున్నామన్నారు. నెల్లూరు అభివృద్ధి జరిగి సుందరంగా మారాలంటే ఎమ్మెల్యేగా పొంగూరు నారాయణ, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలను గెలిపించాలకి కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు భువనేశ్వరీ ప్రసాద్, మల్లికార్జున, సుభాన్‌బాషా, శేషయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్న సోదరులవి నీచమైన రాజకీయాలు : రూప్

నెల్లూరు(వైద్యం), ఏప్రిల్ 8: సోదరి వరసైన ప్రశాంతిరెడ్డిపై కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, ఆయన సోదరుడు రాజేంద్రకుమార్‌రెడ్డి నీచమైన రాజకీయాలు చేస్తున్నారని డిప్యూటీ మేయర్, టీడీపీ నేత పీ.రూప్‌కుమార్ యాదవ్ విమర్శించారు. సోమవారం నగరంలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. విజయసాయిరెడ్డి దగ్గర ఉన్న డీబీ టీమ్ ఉన్నది లేనట్టు లేనిది ఉన్నట్లు క్రియేట్ చేస్తుం దని దుయ్యబట్టారు. నల్లపరెడ్డి రాజేంద్రకు సంబం ధించి అనేక ఆడియోలు తన దగ్గర ఉన్నాయని అవి బయటపెడితే బయట తిరగలేవన్నారు. ప్రసన్న సోదరుల చర్యలు సభ్య సమాజం తలదించుకునేలా ఉందన్నారు. రాజకీయాల్లో చేసిన అభివృద్ధిని చెప్పుకోవాలే గాని ఎంపీ అభ్యర్థి సాయన్న లాంటి వారి కోసం నల్లపరెడ్డి సోదరులు ఇలాంటి నీచ రాజకీయాలు చేయటం దుర్మార్గమన్నారు.

సనాతన హిందూ ధర్మాన్ని కాపాడుకుందాం

ముత్తుకూరు, ఏప్రిల్ 8: సనాతన హిందూ ధర్మాన్ని కాపాడుకుందామని సనాతన ఫౌండేషన్ మండల కన్వీనర్ వావిళ్ల మౌనిక అన్నారు. సోమవారం స్థానిక తాళ్లమ్మవీధి ఎమ్మార్వో గిరిజన కాలనీ ప్రాంతాల్లోని గ్రామ దేవతల ఆలయాలకు పూజా సామాగ్రిని అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, స్థానిక నాయకులు అలారి రవణమ్మ, వావిళ్ల మొలకయ్య, ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

వర్చుసా లైఫ్ స్పేసెస్‌కు ప్రజాదరణ

● ఎండీ వాయిగండ్ల వెంకటేశ్వర్లు



నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 8 : మధ్య తరగతి ప్రజల నుంచి ఉన్నత వర్గాల వరకు అందరికీ అనుకూలంగా ఓపెన్ ప్లాట్లు వేయడంతో జిల్లా ప్రజలు వర్చుసా లైఫ్ స్పేసెస్‌ను ఆదరిస్తున్నారని ఆ సంస్థ ఎండీ వాయిగండ్ల వెంకటేశ్వర్లు తెలిపారు. తమ స్థిరాస్తి వ్యాపారాన్ని 2018లో హైదరాబాద్‌లో ప్రారంభించామన్నారు. అనంతరం తమ సొంత జిల్లా నెల్లూరు, బెంగళూరులో బ్రాంచిలు ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటి వరకు వేసిన అన్ని వెంచర్లు నుడా అనుమతిని కలిగి, 40, 60 అడుగుల వెడల్పు గల రోడ్లు, సీసీరోడ్లు, చుట్టూ ప్రహరీ, దేవాలయం, భద్రత, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ తదితర వసతులు ఉన్నాయన్నారు. నెల్లూరు నగరానికి సమీపంలోని కాకుపల్లి దగ్గర బుజకౌంటీ, బ్లోసమ్‌సిటీ, బుచ్చి-ముంబై హైవే పక్కన భవిష్యనిధి, మదరాజుగూడూరు వద్ద వర్ధన్ వెలాషియా తదితర మెగా వెంచర్లలో ఓపెన్ ప్లాట్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. నిరుద్యోగ యువతకు కూడా శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నామన్నారు.

ఆశీర్వదించండి.. ఆదరించండి !

● ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు వేమిరెడ్డి, పొంగూరు


క్రైస్తవ సభలో పొంగూరు, వేమిరెడ్డి, కోటంరెడ్డి

నెల్లూరు(విద్య), ఏప్రి ల్ 8 : ప్రజలు మమల్ని ఆశీర్వదించి ఆదరించాలని టీడీపీ నెల్లూరు ఎంపీ అభ్య ర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, నగర ఎమ్మెల్యే అభ్యర్థి పొంగూరు నారాయణలు అభ్య ర్థించారు. నగరంలో ని కస్తూర్బా కళాక్షే త్రంలో సోమవారం జిల్లా క్రైస్తవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భం గా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాసేవ చేయాలన్న సంకల్పంతో మీ ముందుకు వచ్చిన తాను అభివృద్ధి ఎలా ఉంటుందో చేసి చూపిస్తానన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే క్రైస్తవులకు అండగా నిలుస్తామన్నారు. పొంగూరు నారాయణ మాట్లాడుతూ నెల్లూరు గడ్డపై పుట్టి పెరిగిన తాను ఎన్నో విద్యాసంస్థలు నెలకొల్పి ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దానన్నారు. పుట్టిన గడ్డకు ఏదో మంచి చెయ్యాల న్న లక్ష్యంతో రాజకీయాల్లోకి అడుగుపెట్టిన తాను గతంలో మంత్రిగా ఉన్న సమయం లో రూ.5,200 కోట్లతో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశానన్నారు. క్రైస్తవులు తనకు అండగా ఉండి ఎంతో ప్రోత్సహించారన్నారు. రానున్న ఎన్నికల్లో కూడా తమను ఆశీర్వదించి గెలపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, క్రైస్తవ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు

పొంగూరు నారాయణ, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నగరంలోని సత్యనారాయణపురంలో మహాగణపతి ఆలయం పునః ప్రారంభోత్సవ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, నాయకులు మామిడాల మధు, శోభన్ బాబు తదితరులు పాల్గొన్నారు. ఆలయ మాజీ ఛైర్మన్ గౌరాబత్తిన సుబ్బారావు వైసీపీకి రాజీనామా చేసి తెలుగుదేశం పార్టీలో చేరారు. టీడీపీ నేతలు లెక్కల వెంకారెడ్డి, అల్లి శోభన్‌బాబు, రోశిరెడ్డిలు కలిసి సుబ్బారావుకు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే 11వ డివిజన్‌లో పొంగూరు నారాయణప్రచారం నిర్వహించారు. అలాగే నగరంలోని 51వ డివిజన్‌లో మాజీమంత్రి, నగర టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పొంగూరు నారాయణ, నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలు ప్రచారం నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ జయరాజ్, జోసఫ్, ఉమా మిత్రబృందం తెలుగుదేశం పార్టీలో చేరడంతో వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

● నగరంలోని 44వ డివిజన్లో మాజీ మంత్రి పొంగూరు నారాయణ కుమార్తె సింధూర ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నగర ఎమ్మెల్యేగా తన తండ్రి పొంగూరు నారాయణను, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

అసమర్థ వైసీపీ పాలనలో రాష్ట్రం నిర్వీర్యం

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 8 : వైసీపీ అసమర్థ పాలనతో రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడి వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయని టీడీపీ నేత కేతంరెడ్డి వినోద్‌రెడ్డి ఆరోపించారు. నగరంలోని 16వ డివిజన్‌లో ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి పొంగూరు నారాయణలకు మద్దతుగా సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించి మాట్లాడారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించే శక్తి ఒక్క చంద్రబాబునాయుడికే ఉందన్న విషయాన్ని ప్రజలు గుర్తించారన్నారు. రానున్న ఎన్నికల్లో ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా పొంగూరు నారాయణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

మెగా ఉచిత వైద్య శిబిరం

పొదలకూరు, ఏప్రిల్ 8: మేజర్ పంచాయతీ పరిధిలోని లింగంపల్లి స్కిల్ డెవలప్‌మెంట్ బిల్డింగ్‌లో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ఆగ్నేష్ చారిటబుల్ ఫౌండేషన్, ఆగ్నేష్ మల్టీపర్పస్ డెవలప్‌మెంట్ సొసైటీ, టి మైఖేల్ (ఎన్నారై), ఎన్‌వి ప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో వైద్యులు రోగులకు బీపీ, షుగర్, పలు రకాల వైద్య సేవలు అందించి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో శివాజీ యూత్ ఫౌండేషన్, సేవా బ్లడ్ బ్యాంక్ ఛైర్మన్ మోపూరు భాస్కర్‌నాయుడు, డాక్టర్ బాలకోటేశ్వర్లు, జి కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు శిక్షణ

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్8: మండలంలోని రేబాల, పెనుబల్లి, వవ్వేరు, పంచేడు, గ్రామాలలోని రైతులకు డీఆర్సీ వ్యవసాయ అధికారులు బీఎస్ చక్రవర్తి, ఏ వాసు, బుచ్చి మండల వ్యవసాయాధికారి సురేందర్‌రెడ్డి తదితరులు ఆరుతడి పంటలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. వీఏఏలు, డి. అనిత, బి.పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ఉగాది శుభాకాంక్షలు


ఆకుపై కార్వింగ్‌తో ఉగాది సూక్ష్మచిత్రం

ముత్తుకూరు, ఏప్రిల్ 8 : తెలుగు సంవత్సరాది ఉగాది సందర్భంగా రావి ఆకుపై కార్వింగ్‌తో ఉగాది సూక్ష్మ చిత్రాన్ని రూపొందించి శుభాకాంక్షలు తెలిపారు ముత్తుకూరుకు చెందిన సూక్ష్మ చిత్రకారుడు సోమా పద్మారత్నం. ప్రజలందరూ షడ్రుచులతో ఉగాది పండుగ జరుపుకోవాలన్నారు.

ఉగాది పచ్చడిలోని షడ్రుచుల్లో ఆరు రకాల ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. వేసవి నుంచి రక్షణ కల్పించే ఆ ఆరోగ్య ప్రయోజనాల గురించి తెలుసుకుందాం!

పచ్చడిలో ప్రయోజనాలు





ఆధునిక వైద్య శాస్త్రం విటమిన్లు, ఖనిజ లవణాలు మొదలైన పోషకాల తూకాన్ని బట్టి ఆహార పదార్థాల పోషక విలువను లెక్క కడుతుంది. ఆరు రుచుల సిద్ధాంతాన్ని అనుసరించే ఆయుర్వేద శాస్త్రం, షడ్రసోపేతమైన ఆహారాన్నే పోషకాహారంగా పరిగణిస్తుంది. ఈ వైద్య రహస్యాన్ని ఉగాది పచ్చడి గుర్తు చేస్తుంది. ఉగాది పచ్చడి శరీరంలోని వాత, పిత్త, కఫ దోషాలను తొలగిస్తుందని కూడా ఆయుర్వేదం చెప్తోంది. ఉగాది పచ్చడిలోని ఆరు రుచులు శరీరాన్ని రాబోయే కాలానికి తగ్గట్టు సిద్ధం చేస్తాయి. వగరు, తీపి, చేదు, పులుపు, కారం, ఉప్పు.. ఈ ఆరు రుచులు రక్త దోషాలతో సంబంధమున్న దద్దుర్లు, అలర్జీలు, జ్వరం, ఇతర చర్మ సమస్యల నుంచి రక్షణ కల్పిస్తాయి.

చేదు చేసే మేలు

ఉగాది పచ్చడిలో ఉపయోగించే వేప పూలు క్రిమిసంహారకాలు. రోగనిరోధకశక్తిని పెంచడంతో పాటు, రక్తదోషాలను కూడా హరిస్తాయి. ఉగాది పచ్చడిలో కలుపుకోవడమే కాకుండా వేప పూలతో పచ్చడి, కారప్పొడి చేసుకుని అన్నంతో పాటు తినవచ్చు. వేప పూలు 35 రకాల వ్యాధులను అరికడతాయి. వేప ఆకులు, పూలు, పండ్లు, విత్తనాలు, వేర్లు, బెరడు, జిగురుల్లో కూడా ఔషధ గుణాలుంటాయి.

తీపి లాభం

ఉగాది పచ్చడిలో ఉపయోగించే బెల్లం వల్ల కాలేయం శరీరంలోని విషాలను బయటకు నెడుతుంది. సెలీనియం, జింక్ లాంటి ఆక్సిడెంట్స్ కలిగిన బెల్లం తినడం వల్ల ఫ్రీ ర్యాడికల్ డ్యామేజ్ ఆగిపోయి, ఇన్‌ఫెక్షన్ల బారిన పడకుండా శరీరం ఇమ్యూనిటీని పొందుతుంది.

వగరు అవసరం

వగరుగా ఉండే మామిడి ముక్కలు పేగుల్లోని పుండ్లు, రక్తస్రావాలను అరికడతాయి. వేసవిలో వేధించే ఎండదెబ్బ నుంచి కూడా రక్షణ కల్పిస్తాయి. వీటిలోని సి విటమిన్ ఎండ వేడి నుంచి చర్మాన్ని రక్షిస్తుంది.

పులుపు ప్రయోజనం

చింతపండులోని పులుపు డీహైడ్రేషన్ నుంచి కాపాడి, రక్తప్రసరణను మెరుగు పరుస్తుంది. ఛాతీలో మంట తగ్గుతుంది. పేగులను శుభ్రపరిచి, బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్లు రాకుండా చేస్తుంది. రక్తనాళాలు సాగే గుణాన్ని పెంచుతుంది.

ఉప్పు ఉపయోగం

వేసవిలో లవణాలు కోల్పోవడం మూలంగా ఆవరించే నిస్సత్తువ తగ్గడం కోసం ఉప్పు ఉపయోగపడుతుంది. కీళ్ల నొప్పులను తగ్గించి, చమటతో తగ్గిన శరీరంలోని సోడియం మోతాదులను సమం చేస్తుంది.

కారం లాభం

కారంతో స్వల్పకాలిక రుగ్మతలు, చర్మ సమస్యలు తగ్గుతాయి. కారం తినడం వల్ల శరీరం వ్యాధులతో పోరాడే శక్తిని పెంచుకుంటుంది.

డాక్టర్ జి.వి పూర్ణచందు
ఆయుర్వేద నిపుణులు

అవగాహన

ఊబకాయ గర్భిణులు ఎంత బరువు పెరగవచ్చు?

గర్భం దాల్చిన మహిళలు బరువు పెరగక తప్పదు. గర్భిణి పెరిగే బరువును బట్టి కడుపులో పెరిగే బిడ్డ ఆరోగ్యాన్ని వైద్యులు అంచనా వేయగలుగుతారు. అయితే ముందు నుంచే ఒబేసిటీతో బాధపడే గర్భిణుల పరిస్థితి ఏంటి? వాళ్లు ఏ మేరకు బరువు పెరగవచ్చు? పెరిగే బరువుతో వాళ్ల ఆరోగ్యం మీద పడే ప్రభావమెంత?

ఒబేసిటీతో బాధపడే గర్భిణులు 5 నుంచి 9 కిలోల వరకూ, ఎత్తుకు తగిన బరువున్న గర్భిణులు 11 నుంచి 16 కిలోల వరకూ బరువు పెరగవచ్చనే ప్రభుత్వ మార్గదర్శకాలున్నాయి. అయితే 25 - 30 బిఎమ్ఐను కలిగి ఉన్న క్లాస్ 1, 2 ఒబేసిటీ కోవకు చెందిన మహిళలు ప్రస్తుత ప్రభుత్వ ప్రమాణాల కంటే తక్కువ బరువు పెరగడం వల్ల, తల్లికీ, బిడ్డకూ ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ఉంటాయి. అలాగే క్లాస్ 3 ఒబేసిటీకి చెందిన మహిళలు సిఫార్సు చేసిన బరువు కంటే తక్కువ బరువు పెరగడం ప్రయోజనకరంగా ఉండవచ్చు. జెస్టేషనల్ డయాబెటిస్ (గర్భంతో ఉన్న



ప్పుడు మధుమేహం బారిన పడడం), ప్రసవం తర్వాత కూడా పెరిగిన బరువు తగ్గకపోవడం (ఎక్సెసివ్ పోస్ట్‌పార్టమ్ వెయిట్ రిటెన్షన్), మేటర్నల్ కార్డియో మెటబాలిక్ డిసీజ్, పిల్లలు నెలలు నిండకుండా పుట్టడం, పుట్టిన వెంటనే పసికందులు చనిపోవడం మొదలైన సమస్యలు తలెత్తకుండా ఉండాలంటే, గర్భంతో ఉన్నప్పుడు అవసరానికి మించి బరువు పెరగకుండా చూసుకోవాలి. ఊబకాయులైన మహిళలు గర్భం దాల్చడానికంటే ముందే వైద్యులను కలిసి బరువు తగ్గించుకునే ప్రయత్నం చేయాలి. వైద్యులు సూచించిన ఆహార నియమాలను కచ్చితంగా పాటిస్తూ, ప్రమాణాలకు మించి బరువు పెరగకుండా చూసుకోవాలి.

మీకు తెలుసా?

ఈ బ్యాండ్ ఎయిడ్ వద్దు

బ్యాండ్ ఎయిడ్ లేని ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లు ఉండవు. అయితే మనందరం వాటర్ ప్రూఫ్ బ్యాండ్ ఎయిడ్‌లనే కొంటూ ఉంటాం. కానీ వీటిలో విషపూరిత 'ఫరెవర్ రసాయనాలు' ఉంటాయి.

వాటర్ ప్రూఫ్ బ్యాండ్ ఎయిడ్స్‌లో అనే ఫరెవర్ కెమికల్స్ ఉంటాయి. ఇవి గాయం ద్వారా రక్తప్రవాహంలో కలిసి, పలు రకాల ఆరోగ్య సమస్యలను కలిగిస్తాయి. ఈ రసాయనాలు పిల్లల ఎదుగుదల, పునరుత్పత్తులను ప్రభావితం చేయడంతో పాటు ఒబేసిటీ, పలు రకాల కేన్సర్లను కూడా కలిగిస్తాయి. మరి ఇంతటి దుష్ప్రభావాలను కలిగి ఉన్న ఫరెవర్ కెమికల్స్‌ను గాయాలను మాన్పే బ్యాండ్ ఎయిడ్ తయారీలో ఎందుకు ఉపయోగిస్తున్నారు? పిఎఫ్ఎఎస్ (పాలీఫ్లోరో ఆల్కైల్ సబ్‌స్టెన్సెస్) ఇది సింథటిక్ కెమికల్. నీటికి తడవవు, వేడికి చెక్కుచెదరవు, నూనె, జిడ్డులాంటివి



వీటికి అంటుకోవు. కాబట్టే ఈ రసాయనాన్ని బ్యాండ్ ఎయిడ్స్‌తో పాటు జిగురును కలిగి ఉండే అథెసివ్స్ నాన్‌స్టిక్ వంట పాత్రలు, ఫుడ్ ప్యాకేజింగ్స్‌లో విరివిగా ఉపయోగిస్తూ ఉంటారు. ఈ ఫరెవర్ కెమికల్స్ (శాశ్వత రసాయనాలు)కు ఆ పేరు రావడానికి కారణం, ఇవి ఎప్పటికీ క్షీణించకపోవడమే! కాబట్టే ఇవి శరీరంలోకి చేరుకున్న తర్వాత ఎన్నో ఏళ్ల పాటు అక్కడే ఉండిపోతాయి. ఇవి గాయాల ద్వారా, స్పర్శ ద్వారా శరీరంలోకి చేరుకుని ఆరోగ్యకరమైన కణజాలాల్లో తిష్ఠ వేసుకుని అంతర్గత అవయవాలకు హాని కలిగిస్తాయి. కాబట్టి వాటర్ ప్రూఫ్ బ్యాండ్ ఎయిడ్‌లు, నాన్‌స్టిక్ కుక్‌వేర్, ప్యాకేజ్డ్ ఫుడ్స్ వాడకం మానేయాలి.



డయాబెటిస్

మధుమేహులు తీపి తినొచ్చా?

బొబ్బట్లు, పూర్ణాలు, పొంగలి, పాయసం... ఉగాది పిండివంటలు నోరూరిస్తుంటే మనసు చంపుకుని, నోరు కట్టేసుకోవడం ఎవరికైనా కష్టమే! మరి మధుమేహుల సంగతేంటి? తీపి జోలికి వెళ్లకుండా ఉండవలసిందేనా? అవసరం లేదంటున్నారు వైద్యులు. స్వీట్స్ తిన్నా, షుగర్ పెరగకుండా ఉండడం కోసం ఏం చేయాలో, 'డయాబెటిక్ నర్వ్ డ్యామేజ్'కు గురి కాకుండా ఉండాలంటే ఎలా నడుచుకోవాలో వైద్యులు చెప్తున్నారు.

మధుమేహులు పండుగలు, వేడుకల్లాంటి సందర్భాల్లో పరిమితంగా తీపి తినొచ్చు. అయితే ఏం తిన్నాం అనే దాని కంటే ఎంత తిన్నాం? అనేది గమనించుకోవాలి. తినే తీపి విషయంలో పరిమితి పాటించాలి. ఒక స్వీటుతో సరిపెట్టేసుకుంటే ఫర్వాలేదు. ఒక స్వీటుతో తినడం ఆపలేని వాళ్లు స్వీట్లకు దూరంగా ఉండడమే మేలు. అలాగే కొందరు మధుమేహులు 'నచ్చినన్ని స్వీట్లు తినేసి, ఒకటికి రెండు చక్కెర మాత్రలు వేసుకుంటే సరిపోతుందిలే!' అనుకుంటూ ఉంటారు. కానీ ఇది సరి కాదు. చక్కెర మాత్రలు దీర్ఘ సమయం పాటు ప్రభావాన్ని చూపుతాయి. మధ్యాహ్నం భోజనంలో స్వీట్లు తినేసి, రెండు చక్కెర మాత్రలు వేసుకుంటే రాత్రికి లేదా మరుసటి రోజు



ఉదయానికీ శరీరంలో చక్కెర మోతాదులు పడిపోవచ్చు. కాబట్టి ఒకటికి రెండు మాత్రలు తీసుకోవడం సరి కాదు. ఎప్పటి మాదిరిగానే మందులు వేసుకోవాలి. అలాగే స్వీట్ తిన్నా చక్కెర నియంత్రణలో ఉండడం కోసం కొన్ని జాగ్రత్తలు పాటించాలి. స్వీటు తిన్నప్పుడు మిగతా ఆహారంలో కోత విధించడం, అదనంగా మరొక 15 నిమిషాలు నడవడం లేదా వ్యాయామం చేయడం చేయాలి.

పిల్లల ఇన్సులిన్ ఇంజెక్షన్ ఇలా...

టైప్1 డయాబెటిస్ పిల్లల విషయంలో వాళ్లు స్వీటు తినేటప్పుడు, తిన్న గంటన్నర తర్వాత చక్కెరను పరీక్షించాలి. ఒకవేళ రక్తంలో చక్కెర పెరిగినట్టు కనిపిస్తే, అవసరాన్ని బట్టి ర్యాపిడ్ ఇన్సులిన్ రెండు నుంచి నాలుగు యూనిట్లు ఇవ్వాలి. అయితే ఇలా ఇన్సులిన్ కరెక్షన్ చేసే సమయంలో, అప్పటివరకూ పిల్లలు తిన్న పిండిపదార్థాల మోతాదును అంచనా వేయవలసి ఉంటుంది. ఇలా పిల్లల ఆహారపుటలవాట్లను కచ్చితంగా లెక్కించే తల్లితండ్రులు, వాళ్ల కార్బోహైడ్రేట్ల మోతాదును అంచనా వేసి, తిన్న స్వీటు ఆధారంగా పిల్లలకు ఇవ్వవలసిన ఇన్సులిన్ మోతాదును లెక్కించి ఇంజెక్షన్ ఇవ్వవచ్చు. అయితే అలాగని పిల్లలు తరచూ స్వీట్లు తినడానికి వీల్లేదు. అరుదుగా మాత్రమే ఇలా ర్యాపిడ్ ఇన్సులిన్ ఇంజెక్షన్ మీద ఆధారపడాలి.

వ్యాయామం అవసరం!

- అరగంట తగ్గకుండా, ఆపకుండా నడవాలి.
- యోగా, ఏరోబిక్స్, స్కిప్పింగ్, స్ట్రెచెస్, యాబ్స్ పుషప్స్, క్రంచెస్, లైట్ వెయిట్స్ మొదలైన వ్యాయామాలు చేయాలి.
- గదులు శుభ్రం చేయడం, తోట పని, పుస్తకాల అల్మారా సర్దడం లాంటి ఇంటిని శుభ్రపరిచే పనులు కూడా వ్యాయామ ఫలాన్నే అందిస్తాయి.
- శరీర బరువు అదుపులో ఉంచుకోవడం కోసం తాజా పళ్లు, కూరగాయలతో పక్కా ఆహార ప్రణాళిక తయారుచేసుకుని, అనుసరించాలి.
- గ్లైసెమిక్ ఇండెక్స్ క్యాలరీలు, పిండిపదార్థాలు, ఆహార పరిమాణాలు సరిచూసుకుంటూ పోషకాల లోపం ఏర్పడకుండా చూసుకోవాలి.
- ఇంట్లో చిరుతిళ్లు లేకుండా చూసుకోవాలి.

నాడులు దెబ్బతింటే...

దీర్ఘకాలంగా మధుమేహం కలిగి ఉన్న వాళ్ల, క్రమం తప్పకుండా షుగర్ మందులు వాడుకుంటున్నప్పటికీ, వాళ్లలో ఎంతో కొంత నాడీ నష్టం జరుగుతూ ఉంటుంది. పాదాలు, అర చేతుల్లో సూదులతో గుచ్చినట్టు, మండుతున్నట్టు అనిపిస్తే, డయాబెటిక్ నర్వ్ పెయిన్‌గా అనుమానించాలి. దెబ్బతిన్న నాడులకు రక్త సరఫరా మందగించడం మూలంగా ఆయా అవయవాల్లో నొప్పి వేధించడం మొదలుపెడుతుంది. దాంతో చిన్నపాటి పనులు కూడా చేయలేని దుస్థితి నెలకొంటుంది. ఆ పరిస్థితే... న్యూరోపతీ లేదా పెరిఫెరల్ నర్వ్ డ్యామేజ్. 60 నుంచి 70 శాతం మధుమేహుల్లో న్యూరోపతీ ఉంటున్నట్టు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డయాబెటిస్ అండ్ డైజెస్టివ్ అండ్ కిడ్నీ డిసీజ్ గణాంకాలు చెప్తున్నాయి. దీర్ఘకాలం పాటు అత్యధిక చక్కెర మోతాదులను కలిగి ఉన్న మధుమేహుల్లో న్యూరోపతీ, నాడి నొప్పితో మొదలవుతుంది. కొందర్లో అంతర్గతంగా న్యూరోపతీ ఉన్నప్పటికీ లక్షణాలు కనిపించకపోవచ్చు. మరికొందర్లో నొప్పి మూలంగా కదల్లేని పరిస్థితి కూడా కనిపించవచ్చు.

ఆహార నియమాలు!

మధుమేహులు అపరిమిత ఆహారం తీసుకోవడానికి వీలు లేదు. కాబట్టి ఈ కోవకు చెందిన వారు తక్కువ పరిమాణంలోనే అన్ని పోషకాలు అందే సంపూర్ణ, సమతులాహారం తీసుకోవాలి. ఇందుకోసం...

- రోజుకు మూడు పూటలూ, మూడు భారీ భోజనాలకు బదులుగా తక్కువ పరిమాణాల్లో ఎక్కువ సార్లు ఆహారం తీసుకోవాలి. ● తాజా పళ్లు, కూరగాయలు తీసుకోవాలి.
- తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ కలిగి ఉండే పదార్థాలు (కూరగాయలు, గోధుమలు, చిరుధాన్యాలు) తీసుకోవాలి.
- వేపుళ్లు వీలైనంత తగ్గించాలి. ● చక్కెర, శీతలపానీయాలు, తేనె, బెల్లం తీసుకోవడం తగ్గించాలి.
- ఆహారంలో మాంసకృత్తుల పరిమాణం పెంచాలి. పాలు, గుడ్లు, చేపలు, చికెన్ వాడకం పెంచాలి. మాంసాహారం పూర్తిగా ఉడకనివ్వాలి.

ఈ లక్షణాల మీద కన్నేసి...

న్యూరోపతీ లక్షణాలు మధుమేహులందర్లో ఒకేలా ఉంటాయి. కానీ ఎక్కువ శాతం మంది ప్రారంభంలో ఆ లక్షణాలను నిర్లక్ష్యం చేస్తూ ఉంటారు. కానీ సమస్య ముదిరి, అవయవం పాడైపోకుండా ఉండాలంటే లక్షణాలను మొదట్లోనే కనిపెట్టాలి.

- **మొద్దుబారడం:** నాడీ నొప్పి మొదలయ్యే ముందు ఆ ప్రదేశం మొద్దుబారుతుంది. నడిచేటప్పుడు పాదాల స్పర్శను కోల్పోతారు. పాదాలకు సాక్సు వేసుకుని నడుస్తున్నట్టు అనిపించవచ్చు. పాదాల్లో, అరచేతుల్లో తిమ్మిర్లు, మంట ఉండవచ్చు.
- **నొప్పి:** అకస్మాత్తుగా కరెంటు షాకు తగిలినట్టు అనిపించడం, తీవ్రమైన నొప్పి వేధించడం కూడా న్యూరోపతీ లక్షణాలే! కొన్నిసార్లు చేతుల్లోని వస్తువులు తెలియకుండా కింద పడిపోతూ ఉంటాయి. ఇలా పట్టు కోల్పోవడం కూడా న్యూరోపతీ లక్షణమే!
- **బ్యాలెన్స్ తప్పడం:** నేరుగా నడవలేకపోవడం, నడిచేటప్పుడు అడుగులు తడబడి, బ్యాలెన్స్ తప్పడం నర్వ్ డ్యామేజీ లక్షణాలు.
- **వేడి, చల్లదనం:** అతి వేడి, అతి చల్లదనాలను తట్టుకోలేకపోవడం. కాఫీ కప్పు నొప్పి కలిగించేటంత వేడిగా అనిపించవచ్చు. చల్లని చేతులతో ఎవరైనా తాకితే, ఆ చల్లదనం బాధను కలిగించవచ్చు.
- **పుండ్లు:** పాదాల్లో పుండ్లు ఏర్పడవచ్చు. లేదా దెబ్బ తగిలినప్పుడు ఆ ప్రదేశంలో నాడీ నష్టం వల్ల స్పర్శ తగ్గడం మూలంగా గాయం తీవ్రతను కనిపెట్టలేకపోవచ్చు.

నాడులు ఎందుకు దెబ్బతింటాయి?

అత్యధిక చక్కెర మోతాదులు నాడులను దెబ్బతీస్తాయి. అధిక రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్, నాడుల ఇన్‌ఫ్లమేషన్.. వీటి వల్ల కూడా నాడులు దెబ్బతినవచ్చు. ఈ సమస్యలకు తోడు మందుల వాడకం క్రమం తప్పడం, సరిపడా మోతాదు మందులను వాడుకోకపోవడం, అస్తవ్యస్థ జీవనశైలి, దురలవాట్లు నర్వ్ డ్యామేజ్‌ను రెట్టింపు చేస్తాయి.

నియంత్రణ ఇలా...

మధుమేహులు క్రమం తప్పకుండా చక్కెరను పరీక్షించుకుంటూ, మందుల మోతాదుపరంగా వైద్యుల సూచనలను అనుసరిస్తూ ఉండాలి. ఆహార నియమాలను తప్పక అనుసరించాలి. వ్యాయామం చేయడంతో పాటు, పాదాలకు ఆర్థోపెడిక్ షూస్ లేదా చెప్పులు ధరించాలి. విటమిన్ బి12 సరిపడా అందేలా చూసుకోవాలి. పాదాల్లో ఏర్పడే గాయాలు, పుండ్ల మీద ప్రత్యేక శ్రద్ధ కనబరచాలి.

డాక్టర్ శ్రీ నగేష్
కన్సల్టెంట్ ఎండోక్రైనాలజిస్ట్ అండ్ డయాబెటాలజిస్ట్,
శ్రీ నగేష్ డయాబెటిస్ అండ్ ఎండోక్రైన్ క్లినిక్,
టోలిచౌకి, హైదరాబాద్.



కృత్రిమ రంగులు

మంచూరియా తింటున్నారా?

కృత్రిమ రంగులు ఆరోగ్యానికి హానికరం అనే విషయం మనందరికీ తెలిసిందే! కాబట్టే కృత్రిమ రంగు 'రోడమైన్ బి' వాడకాన్ని కర్నాటక ప్రభుత్వం నిషేధించింది. కాటన్ క్యాండీలు, గోబీ, చికెన్ మంచూరియాల్లో ఉపయోగించే ఈ హానికారక రంగు గురించిన మరిన్ని వివరాలివి.

రసాయనిక పదార్థం రోడమైన్ బి అనే సింథటిక్ రంగును సిల్క్, జూట్, లెదర్, కాటన్, ఊలు, చిల్లీ పౌడర్ (కారం), చిల్లీ ఆయిల్, సౌందర్యసాధనాలకు రంగును జోడించడం కోసం ఉపయోగిస్తారు. ప్లాస్టిక్ పరిశ్రమాల్లో కూడా దీన్ని విస్తృతంగా ఉపయోగిస్తూ ఉంటారు. దీని ధర కూడా తక్కువ కాబట్టి పదార్థాలకు ఆకర్షణీయమైన రంగును తెప్పించడం కోసం కలరింగ్ ఏజెంట్‌గా దీన్ని ఉంటారు.

ఎంత హానికరం?

ఈ కృత్రిమ రంగుతో కళ్లు, చర్మ సమస్యలు, శ్వాసకోస సమస్యలు కలుగుతాయి. దీన్లో కేన్సర్ కారకాలు కూడా ఉన్నాయి. 2011 ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ (ఫుడ్ ప్రొడక్ట్స్ స్టాండర్డ్స్ అండ్ ఫుడ్ అడిటివ్స్) ప్రమాణాలను అందుకున్న కృత్రిమ రంగులనే ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రకటించింది. అలా అనుమతి పొందిన కృత్రిమ రంగులు ఏవంటే...

ఎరుపు: పాంకో 4ఆర్ (కార్మోసీన్, ఎరిత్రోసిన్)
పసుపు: టార్ట్రాజీన్, సన్‌సెట్ ఎల్లో ఎఫ్‌సిఎఫ్
నీలం: ఇండిగో కార్మిన్, బ్రిలియంట్ బ్లూ ఎఫ్‌సిఎఫ్
ఆకుపచ్చ: ఫాస్ట్ గ్రీన్ ఎఫ్‌సిఎఫ్

కల్తీ ఇలా కనిపెట్టాలి

ప్రభుత్వ అనుమతి పొందిన సురక్షిత రంగులకు బదులుగా, నిషేధం విధించిన హానికారక రోడమీన్ బితో కల్తీ చేసిన పదార్థాలను కొన్ని చిట్కాల ద్వారా గుర్తుపట్టవచ్చు. అదెలాగంటే...



కారం: రెండు గ్రాముల కారాన్ని టెస్ట్‌ట్యూబ్‌లో వేసి, 5 మి.లీ ఎసిటోన్ (ఇది మెడికల్ షాపుల్లో కూడా దొరుకుతుంది. నెయిల్ పాలిష్ రిమూవర్ కూడా వాడుకోవచ్చు) కలపాలి. తర్వాత ఎసిటోన్ లేయర్ ఎరుపు రంగులోకి మారితే, కారంలో రోడమీన్ బి ఉందని అర్థం.

చిలకడదుంపలు: దూదిని నీళ్లలో లేదా వంట నూనెలో ముంచి, చిలకడదుంపల మీద రుద్దాలి. దూది ఎరుపు లేదా వంకాయ రంగులోకి మారితే దుంపలకు రోడమీన్ బి కలిపారని అర్థం.

కూల్ ఫుడ్స్

చల్లబడదాం!



వేసవి వేడి ప్రభావం ఆరోగ్యాన్ని దెబ్బ తీయకుండా ఉండాలంటే ఈ కాలంలో కొన్ని పదార్థాలను ఆహారంలో చేర్చుకుంటూ ఉండాలి. అవేంటంటే...

పుచ్చ: నీటి శాతం ఎక్కువగా ఉండే పుచ్చ పళ్లలో వేసవి వేడిమి నుంచి శరీరానికి రక్షణ కల్పించే సూక్ష్మ పోషకాలుంటాయి. కాబట్టి వేసవిలో ఈ పండు తరచూ తింటూ ఉండాలి.

నెయ్యి: నెయ్యి కీళ్లను ల్యూబ్రికేట్ చేసి, నొప్పులను అరికడుతుంది. వేసవిలో హైడ్రేషన్ మూలంగా శరీరంలో నీటి శాతం తగ్గకుండా ఉండడం కోసం, చర్మం పొడిబారిపోకుండా ఉండడం కోసం నెయ్యిని ఆహారంలో చేర్చుకోవాలి.

నిమ్మ: నిమ్మకాయల్లోని సి విటమిన్ శరీరం అలసటకు గురి కాకుండా నియంత్రించి శరీరాన్ని చల్లబరుస్తుంది. కాబట్టి వంటల్లో నిమ్మరసం ఎక్కువగా వాడుకోవాలి. తాగే నీళ్లలో కూడా నిమ్మరసం కలుపుకుంటూ ఉండాలి.

కొత్తిమీర: జీర్ణశక్తిని మెరుగపరిచి శరీరాన్ని చల్లబరిచే శక్తి కొత్తిమీరకు ఉంటుంది. కాబట్టి వేసవిలో కొత్తిమీర ఎక్కువగా తీసుకుంటూ ఉండాలి.

కొబ్బరి: కొబ్బరి నీళ్లకూ, లేత కొబ్బరికీ శరీరాన్ని చల్లబరిచే గుణం ఉంటుంది. కాబట్టి వేసవిలో లేత కొబ్బరి తినాలి. కొబ్బరి నీళ్లు తాగుతూ ఉండాలి.

'దిక్సూచి' వెబ్ పేజీలో...
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/hMxfSPZలో చదవండి.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

7

తిరుపతి

జిల్లా వార్తలు

మంగళవారం 9 ఏప్రిల్ 2024



తిరుపతి ఉప ఎన్నికల్లో ఓటరు కార్డుల అక్రమ డౌన్‌లోడ్ వ్యవహారం

పూర్వ మున్సిపల్ కమిషనర్ గిరీషపై సస్పెన్షన్ ఎత్తివేత

అధికారి నిర్లక్ష్యాన్ని అవకాశంగా తీసుకున్న అధికార పార్టీ నేతలు

ప్రాథమిక నిర్ధారణ వల్లే గతంలో వేటు

లోతుగా విచారించాక ఉత్తర్వుల ఉపసంహరణ

తిరుపతి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): తిరుపతి లోక్‌సభ నియోజకవర్గానికి 2021లో జరిగిన ఉప ఎన్నికల్లో ఓటరు కార్డులను అక్రమంగా డౌన్‌లోడ్ చేసిన వ్యవహారంలో సస్పెన్షన్‌కి గురైన నాటి తిరుపతి మున్సిపల్ కమిషనర్ గిరీషపై ఈసీ సస్పెన్షన్ ఎత్తివేసింది. దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ వ్యవహారంలో తొలుత గిరీష సస్పెన్షన్ కూడా ఐఏఎస్ వర్గాల్లో కలకలం రేపింది. ప్రత్యేకించి రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగాన్ని కుదిపేసింది. ఈయన తర్వాత వరుసగా పలువురు కింది స్థాయి అధికారులు, ఉద్యోగులు సైతం సస్పెండైన సంగతి తెలిసిందే. ఓవైపు శాఖాపరమైన విచారణ, మరోవైపు పోలీసు దర్యాప్తు జరుగుతుండగానే గిరీషపై సస్పెన్షన్ ఎత్తివేస్తూ ఈసీ తీసుకున్న నిర్ణయం ముఖ్యంగా జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. దీనివెనుక ఏం జరిగిందన్న దానిపై పలు రకాల అభిప్రాయాలు వినిపిస్తుండగా గిరీష పాత్ర, ప్రమేయం లేదని ఈసీ నిర్ధారణకు వచ్చినందునే ఈ నిర్ణయం తీసుకుందని అధికార వర్గాల సమాచారం.

ప్రాథమిక నిర్ధారణ మేరకే..

లోక్‌సభ ఉప ఎన్నికల నాటికి మున్సిపల్ కమిషనర్‌గా ఉండిన గిరీష, తిరుపతి అసెంబ్లీ సెగ్మెంట్‌కు ఈఆర్వోగా వ్యవహరించారు. ఈసీ రికార్డుల్లో ఈఆర్వోగా ఆయన పేరే ఉంది. ఎపిక్ కార్డులను భారీ సంఖ్యలో డౌన్‌లోడ్ చేయాలంటే ఈఆర్వో లాగిన్ నుంచే వీలవుతుంది. ఈ కారణంగా ఆయన ప్రమేయం ఉందని ప్రాథమికంగా భావించిన ఎన్నికల కమిషన్ తొలుత ఆయన్ను బాధ్యుడిగా పేర్కొంటూ సస్పెన్షన్ వేటు వేసింది. ఎన్నికల ప్రక్రియ గురించి అవగాహన ఉన్న వారంతా గిరీషనే అధికార పార్టీ నేతలకు సహకరించారన్న అభిప్రాయానికి వచ్చారు.

వాస్తవానికి జరిగిందేమిటంటే..

ఎన్నికల నిబంధనల ప్రకారం షెడ్యూలు విడుదలైతే అప్పటికి సంబంధిత జిల్లాలో మూడేళ్లకు పైబడిన అధికారులు తప్పనిసరిగా బదిలీ కావాల్సి ఉంటుంది. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులకు ఈ నిబంధన కచ్చితంగా వర్తిస్తుంది. ఆ కోణంలో తిరుపతి ఉప ఎన్నికల షెడ్యూలు వెలువడే నాటికి గిరీష జిల్లాలో నాలుగేళ్లకు పైబడి పనిచేస్తున్నారు. తొలుత రెండేళ్లపాటు జాయింట్ కలెక్టర్‌గా, తర్వాత తిరుపతి కమిషనర్‌గా రెండేళ్లు కలిపి నాలుగేళ్లయింది. అయితే ఆశ్చర్యకరంగా ఆయన జిల్లా నుంచి బదిలీ కాలేదు. ఎన్నికల సమయంలో ఇక్కడే కొనసాగారు. కాకపోతే తిరుపతి అసెంబ్లీ సెగ్మెంట్‌కు ఈఆర్వోగా వ్యవహరించడానికి తాను నిబంధనల రీత్యా అనర్హుడినని అప్పటి కలెక్టర్‌కు గిరీష నివేదించారు. కలెక్టర్ కూడా ఈసీకి సమాచారమిచ్చారు. ఈఆర్వోగా ఆయన స్థానంలో మరొకరిని నియమించాలని కలెక్టర్‌కు ఈసీ స్వేచ్ఛ ఇచ్చింది. దాంతో మున్సిపల్ కార్పొరేషన్‌లో డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తుండిన చంద్రమౌళీశ్వర్‌రెడ్డిని ఈఆర్వోగా కలెక్టర్ నియమించారు. ఆమేరకు ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో గిరీష పేరు, ఆయన మొబైల్ నెంబరు తొలగించలేదు. సూటిగా చెప్పాలంటే చంద్రమౌళీశ్వర్‌రెడ్డి అనధికారికంగా ఈఆర్వోగా వ్యవహరించారు. సాంకేతికంగా గిరీష బాధ్యత వహించాల్సి వచ్చింది. కొద్దిరోజులు గడిచాక ఈసీ వెబ్‌సైట్‌లో గిరీష అధికారిక మొబైల్ నెంబరు తొలగించి చంద్రమౌళీశ్వర్‌రెడ్డి నెంబరు నమోదు చేశారు. ఇది ఎలా జరిగిందో అర్థం కావడం లేదు. జిల్లా ఎన్నికల అధికారి హోదాలో కలెక్టర్ మాత్రమే ఈ మార్పుచేర్పులు చేయగలరు.

సాంకేతిక ఆధారాలతో సంజాయిషీ..

తిరుపతి ఉప ఎన్నికల నాటికి తాను జిల్లాలో నాలుగేళ్లకు మించి పనిచేస్తుండిన విషయాన్ని ఈసీ దృష్టికి గిరీష తీసుకెళ్లినట్టు సమాచారం. ఆ విషయమై తాను ఈఆర్వోగా వ్యవహరించడానికి వీల్లేదని నాటి కలెక్టర్‌కు రాసిన లేఖను, కలెక్టర్ ఇదే విషయాన్ని ఈసీకి తెలిపిన లేఖను కూడా ఎన్నికల కమిషన్‌కు అందజేశారు. ఈసీ వెబ్‌సైట్‌లో తన అధికారిక మొబైల్ నెంబరు కాకుండా చంద్రమౌళీశ్వర్‌రెడ్డి నెంబరు నమోదైన విషయాన్ని కూడా తెలియజేశారు. వీటికి సంబంధించిన సాంకేతిక ఆధారాలు సమర్పిస్తూ ఉప ఎన్నికల అక్రమాలతో తనకు ఎలాంటి సంబంధం లేదని సంజాయిషీ ఇచ్చినట్టు తెలిసింది. అప్పటికే లోతుగా విచారించిన ఈసీ సైతం ఈ సంజాయిషీతో సంతృప్తి చెందినట్టు సమాచారం. అందుకే విచారణను పెండింగులో ఉంచి.. సస్పెన్షన్ ఎత్తివేస్తూ నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది.

చంద్రమౌళీశ్వర్‌రెడ్డిని ఎడాపెడా వాడేసుకున్న అధికార పార్టీ నేతలు

వ్యక్తిగతంగా ఎలాంటి అవినీతి ఆరోపణలు లేనప్పటికీ తిరుపతి డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తుండిన చంద్రమౌళీశ్వర్‌రెడ్డికి అధికార పార్టీ నేతలు చెప్పింది తూచా తప్పకుండా చేసిపెడతారన్న పేరుంది. చెప్పింది నిబంధనలకు విరుద్ధమైనా సరే.. మారు మాట్లాడకుండా చేసే ఆయన నైజం గమనించిన అధికార పార్టీ నేతలు.. ఈఆర్వో లాగిన్ ఐడీని దుర్వినియోగం చేశారు. ప్రైవేటు కంప్యూటర్ ఆపరేటర్లను పెట్టుకుని చంద్రమౌళీశ్వర్‌రెడ్డి లాగిన్ పాస్‌వర్డు తీసుకుని 36వేల ఎపిక్ కార్డులను డౌన్‌లోడ్ చేయించారు. ఇవేవీ తెలియని ఎన్నికల కమిషన్.. ఈఆర్వో గిరీష కాబట్టి ఆయనే బాధ్యుడిగా సస్పెండ్ చేసింది.

దర్జాగా సూత్రధారులు.. సతమతమవుతున్న పాత్రధారులు

ఎపిక్ కార్డుల వ్యవహారంలో సూత్రధారులైన అధికార పార్టీ నేతలు దర్జాగా తిరుగుతుండగా.. తెలిసి కొందరు, తెలియక కొందరు పాత్రధారులైన అధికారులు మాత్రం ఈసీ చర్యలకు గురై సతమతమవుతున్నారు. ఈసీ వెబ్‌సైట్‌లో ఈఆర్వోగా నమోదైన పాపానికి యువ ఐఏఎస్ అధికారి గిరీష సస్పెన్షన్‌కు గురికావడంతోపాటు కెరీర్‌లోనూ, ఐఏఎస్ వర్గాల్లోనూ అవమానకర పరిస్థితులను ఎదుర్కొన్నారు. అలాగే అధికార పార్టీ నేతల ఒత్తిడికి తలొగ్గి ఈఆర్వో స్థాయిని దుర్వినియోగం చేసినందుకు డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్‌రెడ్డి కూడా సస్పెన్షన్‌కు గురయ్యారు. భవిష్యత్తులో క్రిమినల్ చర్యలు కూడా ఎదుర్కొనే అవకాశముంది. తిరుపతి అర్బన్ తహసీల్దారు, డిప్యూటీ తహసీల్దార్లు సైతం చర్యలకు గురైన సంగతి తెలిసిందే. ఇక కంప్యూటర్ ఆపరేటర్లు పలువురిని తొలగించారు. మండల, జిల్లా స్థాయి అధికారులు ఈసీ చర్యలకు గురి కావడంతో వారి సర్వీసు రిజిస్టర్లలో అవన్నీ నమోదు కానున్నాయి. విచారణ నుంచి బయటపడితే తప్ప భవిష్యత్తులో పదోన్నతులపై కూడా ప్రభావం చూపనుంది. సహచర అధికార, ఉద్యోగ వర్గాల్లో అవమానం మరోటి. పాత్రధారులు ఈ తరహా పరిస్థితులను ఎదుర్కొంటుంటే.. సూత్రధారులైన అధికార పార్టీ నేతలు దర్జాగా ఎన్నికల ప్రచారం సాగిస్తున్నారు. నోరు తెరిస్తే నీతులు, సూక్తులు చెప్పే తిరుపతి కీలక నేత, ఆయన తనయుడు ఈ ఎపిక్ కార్డుల కుంభకోణంలో ప్రధాన సూత్రధారులన్న విషయం బహిరంగ రహస్యంగా మారింది. పోలీసు దర్యాప్తు సక్రమంగా కొనసాగితే సూత్రధారులు నిందితులుగా మారే అవకాశముంది. లేనిపక్షంలో కింది స్థాయి చిరుద్యోగులు బలయ్యే ప్రమాదముంది.

ముసుగు తీసేస్తున్నారు



వైసీపీ సారథ్యంలో వలంటీర్ల రాజీడ్రామాలు

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 8: వలంటీర్లు.. ప్రజల సొమ్మును ప్రభుత్వ జీతంగా పొందే వైసీపీ కార్యకర్తలు అనే విషయం ఎన్నికలు దగ్గరయ్యేకొద్దీ బయటపడుతోంది. కేంద్ర ఎన్నికల కమిషన్ కన్నెర్ర చేయడంతో అడ్డగోలుగా వీరిని ఎన్నికల్లో వాడుకోవాలనుకున్న వైసీపీ ఆలోచనలకు గండి పడుతోంది. దీంతో సేవ అనే ముసుగు తొలగించుకుని అధికార పార్టీ సేవకు సై అంటున్నారు. స్వామి భక్తిని చాటుకోవడానికి సిద్ధమవుతున్నారు. తిరుపతి జిల్లాలో వారితో రాజీనామాలు చేయించి ప్రచార కార్యక్రమాల్లో భాగస్వాములు చేసేందుకు అధికార ఎమ్మెల్యే అభ్యర్థులు కుయుక్తులు పన్నుతున్నారు. ఎన్నికల వేళ ఓటర్లను ప్రలోభాల్లో ముంచడానికి పక్కా ప్రణాళికతో ముందుకు వస్తున్నారు. వలంటీర్లతో రాజీనామాలు చేయించి ప్రత్యక్షంగా రాజకీయాల్లో ప్రచారాస్త్రాలుగా మార్చుకుంటున్నారు. కొంతమంది పరోక్షంగా సహకరిస్తాం రాజీనామాలు చేయమని చెబుతున్నా వారిపై వైసీపీ ఎమ్మెల్యేలు ఒత్తిడి చేయించి బలవంతంగా విధులకు దూరం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. 'ప్రభుత్వం ఇచ్చే గౌరవ వేతనం ఈ రెండు నెలలు మేమే ఇస్తాం.. మా వెంట తిరగండి అవసరమైతే అదనంగా సొమ్ములు ఇస్తాం' అని నమ్మించి రంగంలోకి దింపుతున్నారు. వచ్చేది మా ప్రభుత్వమే మళ్లీ మిమ్మల్నే వలంటీర్లుగా నియమించుకుంటామని భరోసా ఇస్తున్నారు. ఒకవేళ టీడీపీ అధికారంలోకి వస్తే వీరికి భవిష్యత్తు ఉండదని.. కాబట్టి వైసీపీకి అనుకూలంగా ఓటర్ల వద్ద ఓటు వేయించాలని దుష్ప్రచారం చేస్తున్నారు. నమ్మిన వలంటీర్లూ, నమ్మకపోయినా ఒత్తిడికి తలొగ్గినవారూ మూకుమ్మడిగా రాజీనామాలు ఇచ్చేస్తున్నారు. జిల్లాలో సోమవారంనాటికి సుమారు 190మంది రాజీనామాలు చేశారు. ముఖ్యంగా గూడూరు, సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి, చంద్రగిరి, వెంకటగిరి నియోజకవర్గాల్లో అత్యధికమంది రాజీనామా చేశారు. కోట, డీవీ సత్రం, రేణిగుంట, గూడూరు, తడల్లోనూ ఇదే దారి పడుతున్నారు.

స్మార్ట్‌ఫోన్లు ఎక్కడ..?

స్మార్ట్‌ఫోన్లు, సిమ్ కార్డులు, స్కానర్లు ఇవ్వకుండా జిల్లాలో కొంతమంది వలంటీర్లు తప్పించుకుని తిరుగుతున్నారు. నిబంధన ప్రకారం ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన వెంటనే వాటిని అధికారులకు స్వాధీనం చేయాలి. కానీ కొందరు మాత్రం లెక్కలేనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందే లబ్ధిదారుల సమగ్ర సమాచారం వీరి స్మార్ట్‌ఫోన్లలో నిక్షిప్తమై ఉంది. ఎన్నికల్లో ప్రచారానికి వైసీపీకి ఇది బాగా ఉపయోగపడుతుంది. స్వాధీనం చేయని వారి పట్ల అధికారులు కఠిన చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు ఉన్నాయి.

ఈత సరదాకు నిండుప్రాణం బలి

స్వర్ణముఖి నదిలో మునిగిపోయి పాలిటెక్నిక్ విద్యార్థి మృతి



అఖిల్(ఫైల్ ఫొటో)

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 8: స్నేహితులతో కలిసి సరదాగా ఈత కొట్టడానికి వెళ్లిన ఓ పాలిటెక్నిక్ విద్యార్థి స్వర్ణముఖి నదిలో మునిగిపోయి.. మృతి చెందాడు. నాయుడుపేట పట్టణంలోని బీడీ కాలనీలో నివాసం ఉంటున్న మధు, సుహాసిని దంపతుల కుమారుడు అఖిల్(15) ఓ ప్రైవేటు పాలిటెక్నిక్‌లో డిప్లొమా ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం స్నేహితులతో కలసి నాయుడుపేట వద్ద స్వర్ణముఖి నదిలోకి సరదాగా ఈత కొట్టడానికి వెళ్లాడు. అందరూ ఈత కొడుతుండగా ఉన్నట్టుండి అఖిల్ నదిలో మునిగిపోయాడు. భయపడ్డ స్నేహితులు విషయాన్ని కాలనీవాసులకు తెలిపారు. వారు అగ్నిమాపక సిబ్బంది, పోలీసులకు సమాచారమిచ్చారు. వారు నది వద్దకెళ్లి అఖిల్ కోసం గాలించారు. చీకటిపడే సమయానికి అఖిల్ మృతదేహాన్ని గుర్తించారు. అనంతరం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఏకైక కుమారుడు మృతి చెందడంతో ఆ తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (మంగళవారం): సా. 6.28

సహరి (బుధవారం) : ఉ. 4.44

ఎన్నికల్లో హింస, కోడ్ ఉల్లంఘనలు సహించం

కలెక్టర్, ఎస్పీల స్పష్టీకరణ



ఎస్పీ కృష్ణకాంత్ పటేల్‌తో కలిసి మీడియాతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

తిరుపతి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో హింస, కోడ్ ఉల్లంఘనలను సహించేది లేదని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ స్పష్టం చేశారు. సోమవారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లో వారిద్దరూ సంయుక్తంగా మీడియా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. అధికారుల పనితీరు విషయంలో ఎన్నికల కమిషన్ (ఈసీ) రాష్ట్రంపైనా, జిల్లాపైనా కూడా అసంతృప్తిగా ఉందని చెప్పారు. ఇప్పటిదాకా జిల్లాలో తీసుకున్న చర్యల సంఖ్య చాలా తక్కువగా ఉందని, మరింత పెంచాలని ఈసీ నుంచి ఆదేశాలున్నాయని వివరించారు. తనిఖీల్లో పట్టుబడుతున్న నగదు, బంగారు, వెండి వంటి విలువైన వస్తువులకు సంబంధించి తగిన పత్రాలు చూపితే అవి సహేతుకమైతే అదే రోజే వాటిని విడుదల చేయడం జరుగుతుందని కలెక్టర్ చెప్పారు.

మద్యం అమ్మకాలపై నిఘా

మద్యం అమ్మకాలపై నిఘా పెంచినట్టు కలెక్టర్ వెల్లడించారు. మద్యం షాపుల్లో 2013 నుంచి ఏటా ఏప్రిల్ నెలలో జరిగిన అమ్మకాల వివరాలు సేకరించామన్నారు. గత ఏడాది ఏప్రిల్‌లో జరిగిన అమ్మకాల కంటే 30 శాతానికి మించి ఇపుడు అమ్మకాలు జరపడానికి వీల్లేకుండా పరిమితి విధించామన్నారు. ఏ మద్యం షాపులోనైనా 30 శాతానికి మించి అమ్మకాలు జరిగితే ఈసీకి నివేదిస్తామన్నారు. పొరుగు రాష్ట్రం నుంచి మద్యం అక్రమంగా జిల్లాలోకి రాకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఎన్నికల షెడ్యూలు విడుదలైన నేపథ్యంలో ఓటరు జాబితా నుంచి ఇకపై తొలగింపులు ఉండవని స్పష్టం చేశారు. ఈనెల ఒకటోతేదీ నాటికి 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఈనెల 14వ తేదీలోపు తమ ఓటు నమోదు చేసుకునేందుకు మాత్రమే అవకాశం ఉందన్నారు. అదే సమయంలో ఒక పోలింగ్ కేంద్రం నుంచి మరో పోలింగ్ కేంద్రానికి ఓటు బదిలీ చేసుకునేందుకు కూడా అవకాశముందన్నారు. ఓటర్లు కూడా పోలింగ్ రోజు వరకు వేచి ఉండకుండా, ఇపుడే జాబితాలో తమ పేరు ఉందో లేదో చెక్ చేసుకోవాలని సూచించారు.

50 శాతం పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్

జిల్లాలోని 50 శాతం పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేస్తామని ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ తెలిపారు. మొత్తం 2,130 పోలింగ్ కేంద్రాల్లో 671 సమస్యాత్మకం, ఏడు తీవ్ర సమస్యాత్మక కేంద్రాలున్నట్టు గుర్తించామని తెలిపారు.

రాక్షస పాలనను అంతమొందించాలి: నెలవల


సమావేశంలో మాట్లాడుతున్న నెలవల సుబ్రహ్మణ్యం

నాయుడుపేట, ఏప్రిల్ 8: రాష్ట్రంలో రాక్షస పాలనను అంతమొందించాలని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. నాయుడుపేట - శ్రీకాళహస్తి బైపాస్‌రోడ్డు సమీపంలోని శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో సోమవారం టీడీపీ, బీజేపీ, జనసేన సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ పాదయాత్ర సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నేరవేర్చకుండా మోసం చేశారని విమర్శించారు. కూటమిలో ఉన్న మూడుపార్టీలు ప్రణాళిక రూపొందించుకొని ప్రజల్లోకి వెళ్లాలని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు ఉయ్యాల ప్రవీణ్‌కుమార్, శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి విజయకుమార్‌నాయుడు, శ్రీరాం ప్రసాద్, కృష్ణయ్య, ఆకుతోట రమేష్, అశోక్‌కుమార్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, ఎద్దల నరేంద్రరెడ్డి, మురళీ కిషన్‌రెడ్డి, అమరావతి రామయ్య, జంపాల మాల్యాద్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డు ఏర్పాటు

పెళ్లకూరు, ఏప్రిల్ 8: మండలంలోని తాళ్వాయిపాడు రెవెన్యూ పరిధిలోని 74/3, 74/22, 74/21 సర్వే నంబర్‌లోని 19 సెంట్ల ప్రభుత్వ భూమిలో సోమవారం రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. పక్కన ఉన్న ఓ వెంచర్ యజమానులు 19 సెంట్ల ప్రభుత్వ భూమిని కలుపుకోవడంతో గ్రామస్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో సంబంధిత భూమిని సర్వే చేసిన రెవిన్యూ అధికారులు హద్దులు ఏర్పాటు చేసి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ప్రసాద్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సంతోషిబాయి, వీఆర్వో కల్యాణి, సర్వేయర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

నవరత్నాలు కాదు... నవమోసాలు: పాశం

వాకాడు, ఏప్రిల్ 8: గత ఎన్నికలకు ముందు జగన్ ప్రకటించిన నవరత్నాలు పథకాలు... నవ మోసాలుగా మిగిలిపోయాయని గూడూరు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాశం సునీల్‌కుమార్ అన్నారు. వాకాడు మండలంలోని నెలిపూడి పంచాయతీలో సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో ఉన్న పథకాలను జగన్ రద్దు చేశారన్నారు. వైసీపీ అధికాంలోకి వచ్చినప్పటి నుంచి ప్రచారం తప్ప ఎక్కడా అభివృద్ధి జాడ లేదన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కలయికతో విజయం తథ్యమన్నారు. ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నెలకు పింఛను రూ.4వేలు ఇంటి వద్దనే అందజేస్తామని తెలిపారు. నెలిపూడి పంచాయతీకి గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.5.52 కోట్లు అభివృద్ధి పనులు చేశామని, వైసీపీ అధికారంలోకి వచ్చాక ఒక్క పని కూడా జరగలేదన్నారు. కార్యక్రమంలో దువ్వూరు మధుసూదనరెడ్డి, సన్నారెడ్డి విజయశేఖర్‌రెడ్డి, జానకీరామిరెడ్డి, యర్రబోతు రాజగోపాల్‌రెడ్డి, నెల్లూరు సుధాకర్‌రెడ్డి, బత్తిన ప్రమీల, అన్నమేటి చంద్రయ్య, కుంచం దయాకర్, తిరుమూరు శ్రీనివాసులురెడ్డి, తుమ్మల మోహన్‌నాయుడు, దోశకాయల కృష్ణమూర్తి, కుంభాల రమణయ్య, కోటా శ్రీనివాసులు, షేక్ గౌస్‌మొహిద్దీన్, చిరంజీవమ్మ, సునీతమ్మ, తడిమి వెంకటేష్, వేణునాయుడు, గోవిందయ్య, పంత్రాంగం వసంత్, మదార్‌సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.


ప్రచారంలో మాట్లాడుతున్న పాశం సునీల్‌కుమార్

ప్రజాసేవ కోసం వచ్చాం... ఆశీర్వదించండి


చంద్రబాబునాయుడు కాలనీలో వరప్రసాద్, విజయశ్రీ ప్రచారం

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 8: ప్రజాసేవ కోసం రాజకీయాల్లోకి వచ్చామని... తమను ఆశీర్వదించాలని తిరుపతి పార్లమెంటు బీజేపీ అభ్యర్థి వరప్రసాద్, సూళ్లూరుపేట టీడీపీ అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీ కోరారు. పట్టణంలోని చంద్రబాబునాయుడు కాలనీలో సోమవారం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, సీనియర్ నేతలు శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, కందలకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ముందుగా కాలనీ ముఖద్వారం వద్ద ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలకు ముఖ్యమంత్రి జగన్ తన ముద్రవేసుకొని ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. డాక్టర్ నెలవల విజయశ్రీ మాట్లాడుతూ టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్‌కుమార్, టీడీపీ నేతలు రఫీ, గూడూరు ప్రభావతమ్మ, సుధీర్‌రెడ్డి, శ్రీరామ్ ప్రసాద్, షైలారి రాజశేఖర్, వేమసాని శోభన్‌నాయుడు, నిత్య కృష్ణారెడ్డి, జీవీఆర్ నాయుడు, అత్తికాయల సుబ్రహ్మణ్యం, దార్ల రాజేంద్ర, ఉగ్గుమూడి భాస్కర్‌రెడ్డి, అవధానం సుధీర్, సుజాతమ్మ, శివకుమార్‌రెడ్డి, సుబ్బారావు, రవి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి విజయానికి సమన్వయంతో కృషి

గూడూరు, ఏప్రిల్ 8: ఎన్డీఏ కూటమి విజయానికి కృషి టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులందరూ సమన్వయంతో పనిచేసి చేద్దామని గూడూరు ఎమ్మెల్యే అభ్యర్థి పాశం సునీల్‌కుమార్, తిరుపతి ఎంపీ అభ్యర్థి వరప్రసాదరావు అన్నారు. సోమవారం గోగినేనిపురంలో ఎన్డీఏ కూటమి అభ్యర్థుల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీ అభ్యర్థి వరప్రసాదరావు మాట్లాడుతూ వైసీపీలో దళితులకు తగిన గౌరవం ఇవ్వడంలేదన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీకి తగిన బుద్ధిచెప్పాలని ప్రజలను కోరారు. ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్, సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, చంద్రప్ప, పాపారెడ్డి పురుషోత్తంరెడ్డి, శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, కిషోర్‌నాయుడు, సర్వోత్తమరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, బిల్లు చెంచురామయ్య, తీగల చంద్రశేఖర్, పేటేటి చంద్రనీల్, ఇంద్రవర్ధన్, మోహన్, శివ, క్రాంతి, బాలసుబ్రహ్మణ్యం, బైరప్ప, గాలి ప్రకాష్‌నాయుడు, మట్టం శ్రావణి, భారతి, గోను శివకుమార్, బిందురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆదరించండి.. అభివృద్ధి చేసి చూపిస్తా: లక్ష్మీసాయిప్రియ


23వ వార్డులో కరపత్రాలు అందజేస్తున్న లక్ష్మీసాయిప్రియ

వెంకటగిరి, ఏప్రిల్ 8: త్వరలో జరిగే ఎన్నికల్లో తన ఆదరించి గెలిపిస్తే వెంకటగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ ప్రజలను అభ్యర్థించారు. సోమవారం పట్టణ పరిధిలోని 23వ వార్డు మూలసాలి వీధిలోని అక్కమ గుడి వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రచారం ప్రారంభించారు. ఈ సంర్బంగా ఆమె మాట్లాడుతూ వార్డులో టీడీపీ హయాంలో తన తండ్రి కురుగొండ్ల రామకృష్ణ చేసిన అభివృద్ధి మినహా వైసీపీ పాలనలో ఒక్క పని కూడా జరగలేదన్నారు. స్థానికులు ప్రస్తావించిన సమస్యలపై స్పందించిన ఆమె టీడీపీ అధికారంలోకి రారాగానే అన్ని సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతాని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వైసీపీ నుంచి టీడీపీ పార్టీలో చేరిన చిప్పల శివకేశవ, దక్షణాది నరేష్, చిప్పల ఉమామహేశ్వరావు, మలవత్తు వెంకటసుబ్బయ్య, రఫీ, భాస్కర్, వెంకటేష్, చింతగింజల సుబ్రహ్మణ్యం, చొప్రా నారాయణ, దొంతు కృష్ణయ్య, తుమ్మలచర్ల చెంచయ్య, సామల సుధీర్, ఆరీఫ్, అబ్దుల్లా, వందల పుల్లయ్య, సుబ్రహ్మణ్యం, సత్యానందం, అనమల సుదీర్, చిప్పల సుబ్బయ, సాదిక్‌లకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ జానపాటి బాలకృష్ణ, జానపాటి మురళి, సామల లక్ష్మీపతి, శ్రీరామ్‌బాబు, చిన్నం చెంగలరాములు, బండారు నరసింహులు, మచ్చల గోపీ, బండి శివకృష్ణ, గాలి శంకరయ్య, ఒంటెల విజయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

చెంగాళమ్మ ఆలయంలో భక్తుల రద్దీ


ఆలయంలో క్యూలైన్లలో భక్తులు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 8: పట్టణంలోని చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో సోమవారం భక్తుల రద్దీ నెలకొంది. అమావాస్య కావడంతో తమిళనాడు నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకొన్నారు. ప్రతి అమావాస్య రోజున తమిళనాడు నుంచి భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకొని ఇక్కడే రాత్రి నిద్రించి వెళ్తుంటారు. అదే విధంగా వేనాడు దర్గాకు కూడా భక్తులు అధిక సంఖ్యలో వెళ్లారు. మంగళవారం ఉగాది పర్వదినం కావడంతో ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ ఆవరణలో మామిడాకుల తోరణాలు కట్టి సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఉగాది రోజు అమ్మవారు చందనాలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

ప్రచార వాహనానికి పూజలు


ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న టీడీపీ నేతలు

పెళ్లకూరు, ఏప్రిల్ 8: తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి వట్టికుండల శేఖర్‌నాయుడు తన సొంత నిధులతో సకల హంగులతో కూడిన ప్రచార వాహనాన్ని టీడీపీకి సమకూర్చారు. సోమవారం కొత్తూరులో ఆ పార్టీ మండల అధ్యక్షుడు నంది కృష్ణయ్య స్థానిక నేతలతో కలసి ప్రత్యేక పూజలు చేసి వాహనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు గంగాబత్తిన రామకృష్ణ, సుబ్బరామయ్య, రాధానాయుడు, వెంపళ్ల వెంకటేశ్వర్లు, బైనా సుబ్రహ్మణ్యంరెడ్డి, కేవీ నాయుడు, తాళ్ల యుగంధర్, నెలవల ప్రసాద్ యాదవ్, రవి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మెప్మా అధ్యక్షురాలి తొలగింపు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 8: సూళ్లూరుపేట స్త్రీ స్వశక్తి భవనంలో మెప్మా సిటీ మిషన్ మేనేజర్(సీఎంఎం) సౌజన్యపై ఈ నెల 6న శనివారం జరిగిన దాడిపై జిల్లా అధికారులు స్పందించారు. మెప్మా పీడీ రాధమ్మ ఆదేశాల మేరకు డీపీఎం సిబ్బంది, మెప్మా ఏవో సమక్షంలో ఆదివారం విచారణ చేపట్టారు. సీఎంఎంపై దాడికి పాల్పడిన సూళ్లూరుపేట మెప్మా అధ్యక్షురాలు స్వప్నను పదవి నుంచి తొలిగిస్తున్నట్లు ఆదేశాలు జారీ చేశారు. దాడిలో పాల్గొన్న ఆర్పీలు సంధ్య, భవానీని కూడా విధుల నుంచి తొలిగించారు.

బాలాంజనేయస్వామి ఆలయంలో నేటినుంచి శ్రీరామనవమి ఉత్సవాలు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 8: సూళ్లూరుపేటలోని బాలాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం నుంచి శ్రీరామ నవమి వసంతోత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ ప్రధాన అర్చకులు దీవి లక్ష్మీనారాయణ తెలిపారు. ఉగాది రోజు ప్రారంభమై ఈనెల 19 వరకు ఉత్సవాలు వైభవంగా జరగనున్నట్లు పేర్కొన్నారు. ఉత్సవాల్లో స్వామివారు ఒక్కొక్క రోజు ఒక్కొక్క అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

చేతి బోరును వినియోగంలోకి తీసుకురండి


మరమ్మతులకు గురైన బోరు వద్ద స్థానికులు

గూడూరు, ఏప్రిల్ 8: స్థానిక ఇందిరమ్మకాలనీలోని చేతి బోరును వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. సోమవారం వారు మాట్లాడుతూ తమ ప్రాంతానికి ఇప్పటి వరకు తాగునీటి వసతి కల్పించలేదన్నారు. ఉన్న చేతి బోరులో ఉప్పునీరు వస్తుండడంతో వాటిని ఇంటి అవసరాలకు వాడుకుంటున్నామని చెప్పారు. ఈ బోరు కూడా పది రోజుల క్రితం మరమ్మతులకు గురవడంతో నీళ్లలేక అవస్థలు పడుతున్నామని వాపోయారు. వేసవి కావడంతో క్యాన్ల ద్వారా నీటిని కొనుగోలు చేసుకోవాల్సి వస్తోందన్నారు. అధికారులు స్పందించి మర్మతులకు గురైన చేతి బోరును వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

వైసీపీకి బుద్ధిచెప్పేందుకు ప్రజలు సిద్ధం కావాలి

వెంకటగిరి, ఏప్రిల్ 8: ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అన్ని వర్గాలనూ మోసం చేసి వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధం కావాలని కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ అన్నారు. సోమవారం మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ నివాసంలోని టీడీపీ కార్యాలయంలో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. జనసేన, బీజేపీ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రంజాన్ పండుగను ఆనందంగా జరుపుకోండి


నిత్యావసరాలను అందజేస్తున్న సమితి సభ్యులు

గూడూరు అర్బన్, ఏప్రిల్ 8: ముస్లింలందరూ రంజాన్ పండుగను ఆనందంగా జరుపుకోవాలని ప్రగతి సేవా సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ అన్నారు. సోమవారం స్థానిక మాళవ్యానగర్ ప్రాంతంలో ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో పొనకా మల్లికార్జునరెడ్డి దాతృత్వంతో పేద ముస్లింలకు నిత్యావసరాలను అందజేశారు. కార్యక్రమంలో జీ.చంద్రశేఖర్, శ్రీనివాసులు, కరిముల్లా, రాము, కుమార్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఒలింపియాడ్ పరీక్షలలో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

గూడూరు అర్బన్, ఏప్రిల్ 8: ఒలింపియాడ్ పరీక్షల్లో స్థానిక మినర్వా పాఠశాల ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపాల్ రాంప్రసాద్ తెలిపారు. సోమవారం విద్యార్థులకు బహుమతులను, మెమెంటోలను అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ వినోద్‌కుమార్, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాలపై డేగ కన్ను

కోట, ఏప్రిల్ 8: ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాలపై డేగ కన్ను వేసి ఉంచాలని ఎస్ఐ నాగబాబు తెలిపారు. సోమవారం ఆయన సమస్యాత్మక గ్రామాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీసులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలోని 21 పంచాయతీల్లో సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక గ్రామాలను గుర్తించామన్నారు. ఆయా గ్రామాలపై నిఘా వేసి ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలన్నారు.

వలంటీర్ల రాజీనామా

దొరవారిసత్రం/తడ, ఏప్రిల్ 8: ఏప్రిల్ 8: దొరవారిసత్రం మండలంలోని ఏకొల్లు పంచాయతీ పరిధిలో పని చేసే 16 మంది వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను ఎంపీడీవో కార్యాలయ సూపరింటెంట్ రఘురామయ్యకు అందజేశారు. అలాగే తడ మండలం కొండూరు సచివాలయ పరిధిలో 12 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయ ఏవో మురళీకృష్ణకు రాజీనామా పత్రాలను సమర్పించారు.

మద్యం, నగదు స్వాధీనం

తడ, ఏప్రిల్ 8: చెక్‌పోస్టులో నగదు, మద్యాన్ని ఎస్ఈబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం రాత్రి సమయంలో చెన్నై నుంచి ఒంగోలుకు వెళ్తున్న కారును తనిఖీ చేశారు. అందులో రూ.95వేల నగదు, 2 లీటర్ల ఇతర రాష్ట్రాల మద్యం బాటిళ్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీలో చేరికలు


టీడీపీలో చేరిన వారితో వేనాటి సతీష్ రెడ్డి

సూళ్లూరుపేట, ఏప్రిల్ 8: సూళ్లూరుపేట మండలం ఆబాక పంచాయతీకి చెందిన వైసీపీ నాయకులు సోమవారం టీడీపీలో చేరారు. వారికి టీడీపీ జిల్లా కార్యదర్శి వేనాటి సతీష్ రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో సి.మునిరాజా, ఎ.శ్రీనివాసులు, బి.వెంకటరమణయ్య, వి.జనార్ధన్, బాబు, వెంకటయ్య, కృష్ణయ్య, వై.వెంకటరమణయ్య ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు కొక్కు శంకరయ్య, పాకం వెంకటసుబ్బయ్య, బీసీ నాయకులు సుబ్రహ్మణ్యం, తిరుపాల్, మధు, గురకల సుబ్రహ్మణ్యం, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

ఉగాదికి ఆలయాల ముస్తాబు

వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 8: క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలకు పట్టణంలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. స్థానిక గ్రామశక్తి పోలేరమ్మ ఆలయం, రామలింగేశ్వర స్వామి ఆలయం, కర్ణకమ్మ వీధిలోని హరహర క్షేత్రం ఆలయాల్లో ఉగాది వేడుకలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉదయం నుంచి ఆలయాల్లో పలు పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు.

గూడలిలో హంస వాహనసేవ

కోట, ఏప్రిల్ 8: మండల పరిధిలోని గూడలిలో గల కామాక్షీదేవి సమేత సంఘమేశ్వరస్వామి సోమవారం రాత్రి హంస వాహనంపై ఊరేగారు. ఆశేష భక్త జనసందోహం నడుమ సంఘమేశ్వరుడు, కామాక్షీదేవి గూడలి పురవీధుల్లో ఊరేగారు. భక్తులు కొబ్బరికాయలు కొట్టి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.